WANTED

జిల్లాల వారీగా ఉమ్మడి జిల్లా బ్యూరోలు/ జిల్లా స్టాఫ్ రిపోర్టర్ / మండల రిపోర్టర్లు కావలెను.

తెలంగాణ అస్తిత్వానికి మార్గదర్శిగా, ప్రజా గొంతుకగా
మీ ముందుకు వస్తున్న "వారధి తెలుగు దినపత్రిక" లో
పనిచేయుటకు ఉమ్మడి జిల్లా బ్యూరోలు/
జిల్లా స్టాఫ్ రిపోర్టర్ /మండల రిపోర్టర్లు ను ఆహ్వానిస్తోంది.
అనుభవం, తెలుగు భాషపై పట్టు ఉన్న వారు..
ఆసక్తి గల వారు సంప్రదించవచ్చు.

సంప్రదించాల్సిన నెంబర్లు:
9492580091

Facebook.varadhinews

# వారధి

తెలుగు దిన పత్రిక

www.varadhinews.com

సంపుటి:1
సంచిక:25
శనివారం,
28.09.2024



## పర్యాటక ప్రాంతాలుగా హెరిటేజ్ భవనాలు


- చారిత్రక సంపదను కాపాడతాం
- విద్యార్థులకు ఉచిత టూర్ సదుపాయం
- పాత అసెంబ్లీ భవనాన్ని పునరుద్ధరిస్తాం
- అందులోనే శాసనమండలి ఏర్పాటు చేస్తాం
- జూబ్లీహాల్‌ను పరిరక్షించాల్సిన అవసరముంది
- ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి కీలక వ్యాఖ్యలు
- మెట్ల బావులను దత్తత తీసుకున్న పారిశ్రామిక సంస్థలు

**వారధి, స్టేట్ బ్యూరో:**

భాగ్యనగరంలోని పురాతన మెట్లబావుల అభివృద్ధికి కీలక ముందడుగు పడింది. వీటి పునరుద్ధరణకు పలు పారిశ్రామిక సంస్థలు ముందుకొచ్చాయి. సీఎం రేవంత్ రెడ్డి సమక్షంలో పర్యాటకశాఖతో సీఐఐ ఒప్పందం చేసుకుంది. ఉస్మానియా విశ్వవిద్యాలయంలోని మహాలఖా మెట్ల బావిని ఇన్ఫోసిస్, సాలార్ జంగ్, అమ్మపల్లి బావులను భారత్ బయోటెక్ పునరుద్ధరించేందుకు ఒప్పందాలు చేసుకున్నాయి. అడిక్‌మెట్ మెట్ల బావిని దొడ్ల డైరీ, ఫలక్‌నుమా మెట్ల బావిని టీజీఆర్టీసీ, రెసిడెన్సీ మెట్ల బావిని కోఠి మహిళ కళాశాల పునరుద్ధరించేందుకు

2 లో

# మంత్రి పొంగులేటి ఇళ్లలో ఈడీ సోదాలు



- ఏకాలంలో 5 చోట్ల తనిఖీలు
- ఉదయం నుంచి అర్ధరాత్రి వరకూ కొనసాగిన సెర్చింగ్
- కీలక డాక్యుమెంట్లు స్వాధీనం
- భారీగా నగదు పట్టుబడినట్లు సమాచారం
- నేడు వివరాలు వెల్లడించనున్న ఈడీ అధికారులు
- లగ్జరీ వాచ్‌ల కొనుగోలు కుంభకోణంలో దాడులు చేసినట్లు సమాచారం
- ఇది రాజకీయ కక్షసాధింపులో భాగమే
- ఈడీ దాడులపై కాంగ్రెస్ నేతల విమర్శలు

**వారధి, స్టేట్ బ్యూరో:**

రాష్ట్ర రెవెన్యూ మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి ఇంట్లో, ఆయన బంధువుల ఇళ్లలో ఈడీ సోదాలు కలకలం రేపాయి. లగ్జరీ వాచ్‌ల కొనుగోలు కోసం క్రిప్టో, హవాలా మార్గంలో లావాదేవీలు జరిపారనే అభియోగంతో ఈడీ సోదాలు నిర్వహించింది. ఫిబ్రవరి 5న సింగపూర్ నుంచి ఖరీదైన వాచ్‌లు తెప్పించారని, ఇందుకు సుంకం చెల్లించలేదని, చెన్నై కస్టమ్స్ అధికారులు అతని కుమారుడు హర్షారెడ్డికి నోటీసులు జారీ చేశారు. సింగపూర్ నుంచి చెన్నై పోర్టుకు వాచ్‌లు వచ్చినట్లు కస్టమ్స్ అధికారులు తెలిపారు.

అలోకం నవీన్ కుమార్ మధ్యవర్తిగా సింగపూర్‌కి చెందిన ఫహెర్దీన్ ముబీన్ నుంచి హర్షరెడ్డి వాచ్‌లు కొనుగోలు చేసినట్లు కస్టమ్స్ గుర్తించింది. విచారణలో అలోకం నవీన్ కుమార్ రూ. 100 కోట్ల స్మగ్లింగ్ చేసినట్లు కస్టమ్స్ అధికారులు గుర్తించారు. దీనిపై ఇటీవల చెన్నై కస్టమ్స్ అధికారులు హైదరాబాద్, ఖమ్మంలో సోదాలు చేసింది. ఈ వ్యవహారంపై మరో కేసు నమోదు చేసిన ఈడీ దర్యాప్తు చేస్తోంది.

మనీలాండరింగ్ చట్టం కింద కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తోంది. దర్యాప్తులో భాగంగా నగరంలో మొత్తం 5 చోట్ల ఉదయం నుంచి అర్ధ రాత్రి వరకు సోదాలు జరిపింది. ఉదయం 5గంటల నుంచి మంత్రి పొంగులేటి నివాసం, అతని ఫామ్‌హౌస్, జూబ్లీహిల్స్‌లోని కుమార్తె నివాసం, కార్యాలయాలు సహా మొత్తం 5 చోట్ల ఏక కాలంలో ఈడీ సోదాలు చేసింది. సీఆర్‌పీఎఫ్ సిబ్బంది భద్రతతో సోదాలు కొనసాగాయి. ఈ సోదాల్లో భారీ నగదుతో పాటు, కీలక పత్రాలు స్వాధీనం చేసుకున్నట్లు తెలుస్తోంది. దీనికి సంబంధించి ఇవాళ ఉదయం ఈడీ అధికారులు సమాచారం వెల్లడించనున్నట్లు తెలుస్తోంది.

**సోదాలపై కాంగ్రెస్ విమర్శలు**

మరోవైపు ఈడీ సోదాలపై కాంగ్రెస్ మండిపడింది. బీజేపీ చేస్తున్న కుట్రలో భాగంగానే పొంగులేటి శ్రీనివాసరెడ్డి ఇంటిపై ఈడీ దాడులు చేస్తోందని టీపీసీసీ ప్రధాన కార్యదర్శి అద్దంకి దయాకర్ అన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వంలో నాయకులను భయపెట్టడానికి, మానసిక స్థైర్యాన్ని దెబ్బ కొట్టడానికి చేస్తున్న కుట్రని ఆయన విమర్శించారు. సోనియా గాంధీని, రాహుల్ గాంధీని కూడా భయపెట్టడానికి నిరంతరం ఈడీ దాడులు చేస్తున్నారని తెలిపారు. కర్ణాటకలో డీకే శివకుమార్‌పై కూడా దాడి జరిగిందని తెలిపారు. దీని వల్ల కాంగ్రెస్ ప్రభుత్వానికి వచ్చిన నష్టం ఏమి లేదని, బీజేపీ తగిన మూల్యం చెల్లించుకోక తప్పదన్నారు. ఎలాంటి చెడ్డ పేరు లేకుండా మంచి వ్యాపారవేత్తగా పేరున్న పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డిపై దాడులను తీవ్రంగా ఖండించారు. అన్ని రాష్ట్రాలలో ఆర్థికంగా బలపడిన కాంగ్రెస్ నాయకులు, ప్రతిపక్ష నాయకులపై దాడులు జరుగుతున్నాయని, ఇది బీజేపీ మార్క్ రాజకీయానికి పరాకాష్ట అని విమర్శించారు.



## బీఆర్ఎస్, బీజేపీ లోపాయికారీ ఒప్పందం

- అందుకే పొంగులేటిపై ఈడీ దాడులు
- ప్రభుత్వానికి వస్తున్న ఆదరణ చూసి భయపడుతున్నారు
- టీపీసీసీ చీఫ్ మహేష్ కుమార్ గౌడ్

**వారధి, స్టేట్ బ్యూరో:**

మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి ఇంటిపై జరిగిన ఈడీ దాడులపై టీపీసీసీ చీఫ్ మహేష్‌కుమార్ గౌడ్ స్పందించారు. గాంధీ భవన్‌లో ఆయన

2 లో




## ఆపరేషన్ మూసీ ఉద్రిక్తం

- అధికారులపై నిర్వాసితుల దాడి
- సర్వే చేయొద్దంటూ బాధితుల ఆందోళన
- లంగర్ హౌజ్‌లో నిరసన ర్యాలీ
- చైతన్యపురి సత్య నగర్‌లో ఉద్రిక్త వాతావరణం
- పెట్రోల్ పోసుకుని బాధితుల ఆత్మహత్యాయత్నం
- బహదూర్‌పురాలో తహసీల్దార్ కార్యాలయం ముట్టడి

2 లో

## హైదరాబాద్‌లో.. బ్యానర్లు, కటౌట్లు బంద్

- గోడ రాతలపైనా కఠిన చర్యలు
- సంచలన నిర్ణయం తీసుకున్న జీహెచ్ఎంసీ
- క్లీన్ సిటీగా మారుస్తామన్న కమిషనర్ ఆమ్రపాలి



**వారధి, స్టేట్ బ్యూరో:**

జీహెచ్ఎంసీ కమిషనర్ ఆమ్రపాలి మరో సంచలన నిర్ణయం తీసుకున్నారు. గ్రేటర్ హైదరాబాద్‌ను క్లీన్ సిటీగా చేసేందుకు చర్యలు చేపట్టిన కమిషనర్.. ఈ మేరకు కీలక ఉత్తర్వులు జారీ చేశారు. బల్దియా పరిధిలో వాల్ పోస్టర్లు, బ్యానర్లు, కటౌట్లు, వాల్ రైటింగ్‌పై నిషేధం విధించారు. బహిరంగ ప్రదేశాలు, ప్రభుత్వ, ప్రైవేటు భవనాలపై వాల్ పోస్టర్లు అంటించడం, బ్యానర్లు కట్టడం, వాల్ రైటింగ్ చేయడాన్ని నిషేధిస్తూ ఆమ్రపాలి ఆదేశాలు జారీ చేశారు. హైదరాబాద్‌ను క్లీన్ సిటీగా ఉంచే ఉద్దేశంతోనే ఈ నిర్ణయం తీసుకున్నట్లు ఆమ్రపాలి ప్రకటించారు. ఎవరైనా నిబంధనలు అతిక్రమించి

2 లో



## నిర్వహణా లోపమే శాపం

- మేడిగడ్డ బ్యారేజ్ డ్యామేజీకి అదే కారణం
- బ్యాంకు అప్పుల్లో 64వేల కోట్లు గుత్తేదారులకు చెల్లించాలి
- కాళేశ్వరం విచారణలో కీలక విషయాల వెల్లడించిన ఈఎన్సీ హరిరామ్
- నేడు మరోసారి కమిషన్ ఎదుట హాజరు

2 లో



## హైదరాబాద్ టు అయోధ్య

2 లో

- కొత్త విమాన సర్వీసులు ప్రారంభం
- వారానికి నాలుగు రోజులు ప్రయాణం
- హైదరాబాద్ నుంచి ఒక్క నెలలో 7 నూతన సర్వీసులు
- కేంద్ర మంత్రి కిషన్ రెడ్డి ట్వీట్



## దసరా లోపు రుణమాఫీ చేయాల్సిందే

- లేదంటే సీఎంను నిద్రపోనియ్యను
- రైతులతో కలిసి సచివాలయాన్ని ముట్టడిస్తాం
- పంట కోతకు వచ్చినా రైతుబంధు ఇవ్వడం లేదు
- సీఎం రేవంత్‌పై మాజీ మంత్రి హరీష్‌రావు ఆగ్రహం

2 లో

# హైడ్రా పేరుతో దౌర్జన్యం..

- పేదల కన్నీళ్లతో ఆడుకుంటే ప్రభుత్వానికి పతనం తప్పదు
- బాధితులకు అండగా ఉంటాం
- అవసరమైతే కోర్టును ఆశ్రయిస్తాం
- కూల్చివేతలపై ఎంపీ ఈటల ఆగ్రహం
- బాధితులతో కలిసి ఆందోళన



**వారధి, స్టేట్ బ్యూరో:**

హైడ్రా పేరుతో రేవంత్‌రెడ్డి సర్కార్ డ్రామాలు ఆడుతోందని మల్కాజ్‌గిరి ఎంపీ ఈటల రాజేందర్ విమర్శలు చేశారు. ప్రజలకు కంటి మీద కునుకు లేకుండా చేస్తున్నారని మండిపడ్డారు. హైడ్రాను నియమించిన రోజే ఇది డ్రామా అని చెప్పానని అన్నారు. హైడ్రా అధికారులు చెబుతున్న లెక్కల ప్రకారం చెరువులు, కుంటలు చుట్టూ ఉంది.. ప్రభుత్వ భూమి కాదని స్పష్టం చేశారు. ఎన్నో ఏళ్లుగా ఉన్న పేదల ఇళ్లను కూల్చవద్దని ఎంపీ ఈటల రాజేందర్ కాంగ్రెస్ ప్రభుత్వాన్ని కోరారు.

చైతన్యపురి డివిజన్ న్యూ మారుతి నగర్ మూసీ పరిసర ప్రాంతాల్లో ఈటల రాజేందర్ శుక్రవారం నాడు పర్యటించి బాధితులకు అండగా ఉంటానని ధైర్యం చెప్పారు. ఈ సందర్భంగా ఈటల రాజేందర్ మాట్లాడుతూ... పేదలపై కనికరం లేకుండా రేవంత్ ప్రభుత్వ చర్యలు ఉన్నాయని ధ్వజమెత్తారు. జొన్నల బండ వద్ద మాజీ ప్రధానమంత్రి ఇందిరాగాంధీ పేదలకు ఇళ్ల పట్టాలు ఇచ్చారని వాటిని కూడా కూల్చేందుకు రేవంత్ ప్రభుత్వం పనులు చేస్తోందని ఎంపీ ఈటల రాజేందర్ అన్నారు.

మూసీని సుందరీకరణ చేస్తే తమకు ఇబ్బంది లేదు... కానీ ఎన్నడో భూమి కొన్న వారు ఇప్పటికీ ఈఎంఐలు కడుతున్నారని తెలిపారు. లక్షలు పెట్టి కొన్న ఇళ్లకు డబుల్ బెడ్ రూం ఇళ్లు ఇస్తామనడ భావ్యంకాదని ఎంపీ ఈటల

2 లో

వారధి
తెలుగు దిన పత్రిక
www.varadhinews.com





# హైడ్రా పేరుతో దౌర్జన్యం..

**తరువాయిభాగం**

రాజేందర్ అన్నారు. ఈ ప్రాంతాల్లోకి ఏనాడూ మూసీ నుంచి వరద నీరు రాలేదని తెలిపారు. హైడ్రా పేరుతో రేవంత్ ప్రభుత్వం బస్తీ ప్రజలకు కంటి మీద కునుకు లేకుండా చేస్తోందని ఎంపీ ఈటల రాజేందర్ తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. రేవంత్ మాటలు నమ్మినందుకు ప్రజలకు ప్రశాంతత లేకుండా చేస్తున్నారని ఎంపీ ఈటల రాజేందర్ మండిపడ్డారు.

**కేంద్రానికి నివేదిస్తామని వార్నింగ్**

ఖబడ్దార్ రేవంత్.. ప్రజలను ఇబ్బంది పెట్టే పనులు మానుకోవాలని హెచ్చరించారు. కేంద్ర ప్రభుత్వానికి ఈ అంశంపై నివేదిక ఇస్తామని ఎంపీ ఈటల రాజేందర్ అన్నారు. చట్టాలు, జడ్జీల మీద నమ్మకం లేకుండా ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి పని చేస్తున్నారని ఎంపీ ఈటల రాజేందర్ విమర్శించారు. తెలంగాణ రేవంత్ జాగిర్ కాదని... ప్రజలు ఓట్లు వేస్తే సీఎం అయ్యారన్న విషయం గుర్తుపెట్టుకుని మసలుకోవాలని ఎంపీ ఈటల రాజేందర్ సూచించారు.

# బీఆర్ఎస్, బీజేపీ లోపాయికారీ ఒప్పందం

**తరువాయిభాగం**

మీడియాతో మాట్లాడుతూ.. బీఆర్ఎస్, బీజేపీ పార్టీల లోపాయికారీ ఒప్పందంలో భాగంగానే రాష్ట్రంలో ఈడీ దాడులు జరుగుతున్నాయని ఆరోపించారు. మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి ఇంటిపై జరిగిన ఈడీ రైడ్స్ ఈ కుట్రలో భాగమేనని అన్నారు. రాష్టంలో కాంగ్రెస్ ప్రభుత్వానికి వస్తున్న ఆదరణ చూసి ఓర్వలేకే నాయకులను భయపెట్టే ప్రయత్నం చేస్తున్నారన్నారు. కాంగ్రెస్ నాయకులకు పార్టీ అండగా ఉంటుందని భరోసా ఇచ్చారు. ప్రభుత్వాన్ని పడగొట్టేందుకు ఇలాంటి చీప్ ట్రిక్స్ చేయడం మంచిది కాదని హెచ్చరించారు. 2014లో కేంద్రంలో మోడీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన నాటి నుండి 96 శాతం ప్రతిపక్షాల మీదనే దాడులు జరుగుతున్నాయని గుర్తు చేశారు. రాజకీయ లబ్ధి పొందడానికి ప్రతిపక్ష పార్టీల నేతలపై బీజేపీ అక్రమ కేసులు బనాయిస్తోందని ఆగ్రహం వ్యక్తం చేశారు. బీజేపీ అక్రమ కేసులను మేం రాజ్యాంగ బద్ధంగా ఎదుర్కొంటామని స్పష్టం చేశారు. ఇక, ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా ఏర్పాటు చేసిన హైడ్రా గురించి మాట్లాడుతూ.. హైడ్రా కూల్చివేతల వల్ల నష్టపోతున్న పేదలను ఆదుకుంటామన్నారు. ఎన్నికల్లో హామీ ఇచ్చిన మేరకు కాంగ్రెస్ ప్రభుత్వం రైతులకు రూ.2 లక్షల రుణమాఫీ చేసిందని తెలిపారు. రుణమాఫీపై ప్రతిపక్ష బీఆర్ఎస్ తప్పుడు ప్రచారం చేస్తోందని ఆగ్రహం వ్యక్తం చేశారు. రుణమాఫీపై హరీష్ రావు చర్చకు సిద్ధమా అని సవాల్ విసిరారు.

# పి డి ఎస్ యు చరిత్ర పోరాటాల మయమే




**వారధి న్యూస్, వనపర్తి:** పిడీఎస్యు చరిత్రంతా పోరాటాల మయమేనని, విప్లవ విద్యార్థి ఉద్యమాల్లో పిడీఎస్యుదే కీలక పాత్ర అని విద్యార్థులను సామాజిక రాజకీయంగా పురోభివృద్ధి వైపు చైతన్యవంతం చేయడంలో పిడీఎస్యు 50 సంవత్సరాల కాలంలో కీలకపాత్ర వహించిందని పిడీఎస్యు రాష్ట్ర సహాయ కార్యదర్శి బోయిన్ పల్లి గణేష్‌మరియు పి డి ఎస్ యు ఉమ్మడి జిల్లా మాజీ నాయకులు ఆంజనేయులు, C రాజు తెలిపారు. పిడీఎస్యు ఏర్పడి 50 సంవత్సరాలు పూర్తయిన సందర్భంగా, వనపర్తి జిల్లా కేంద్రంలో ప్రభుత్వ జూనియర్ బాలికల కళాశాల నుండి కొత్త బస్టాండ్ వరకు ప్రదర్శన నిర్వహించారు. అక్కడ మాట్లాడి, ముగింపు కార్యక్రమంలో వారు మాట్లాడుతూ, "దోపిడీ వర్గానికి సహాయపడుతూ కులం, మతం, స్త్రీపురుష అసమానతలను నిరంతరం కాపాడుతున్న విద్యా వ్యవస్థ అశాస్త్రీయమైనది" అని వ్యతిరేకిస్తూ, "శ్రామిక వర్గానికి ఉపయోగపడే శాస్త్రీయ విద్యా విధానం కావాలని పోరాడుతున్నాము" అని పేర్కొన్నారు.ప్రతి అంశంలో విద్యార్థులు ప్రశ్నించాలని, ప్రతి వ్యక్తి "ఎందుకు, ఏమిటి, ఎలా" అనే ప్రశ్నలు అడగాలని పి డి ఎస్ యు నేర్పిందన్నారు. ప్రజలను అనేక రకాలుగా మోసగించిన రాజకీయాలను పసిగడుతుందని, తెలంగాణ ప్రత్యేక రాష్ట్రం కోసం జరిగిన ఉద్యమంలో పి డి ఎస్ యు నాయకులు ముందుండి పోరాడి జైలుకు వెళ్లారని చెప్పారు.విద్యార్థులపై పెరుగుతున్న ధరలకు అనుగుణంగా స్కాలర్షిప్, ఫీజు రియంబర్స్మెంట్ పెంచాలని, విద్యార్థులకు ఉచిత బస్ పాసులు ఇవ్వాలని, బస్సుల సంఖ్యను పెంచాలని, పాలిటెక్నిక్ వృత్తి విద్య సులభతరం ఉండాలని, పెరుగుతున్న ఫీజులు తగ్గించాలని PDSU పోరాడిందని చెప్పారు. LKG నుండి యూనివర్సిటీ ఉన్నత విద్య వరకు అనేక విద్యార్థి సమస్యలపై రాజీలేని పోరాటాలు నిర్వహించిందని వారు పేర్కొన్నారు."డబ్బులు ఉన్నవారికి ఒక విద్య, లేని వారికి ఇంకో విద్య కాకుండా అందరికీ ఒకే విద్యా విధానం ఉండాలని పోరాడుతాము" అని అన్నారు. ఈ క్రమంలో PDSU నాయకులు జార్జి రెడ్డి, జంపాల చంద్రశేఖర్ ప్రసాద్, కోల శంకర్, శ్రీపాద శ్రీహరి అమరులయ్యారని, వీరి బాటలో PDSU నిరంతరం ప్రయాణిస్తుందని నేటి ప్రతి విద్యార్థి PDSUలో పయనించాలని ఆకాంక్షించారు.ఈ కార్యక్రమంలో PDSU జిల్లా కోశాధికారి B గణేష్, జిల్లా నాయకులు వెంకటేష్, శివశంకర్, విద్యార్థినీలు తదితరులు పాల్గొన్నారు.

# హైడ్రా భయం తో.. మహిళా ఆత్మహత్య



**వారధి న్యూస్, హైదరాబాద్ :** కూకట్ పల్లి పరిధిలో హైడ్రా భయంతో ఒక్క మహిళా ఆత్మహత్య చేసుకుంది. అక్రమ నిర్మాణాలు కూల్చివేతలో భాగంగా ఇండ్లు కూల్చివేస్తామని హైడ్రా అధికారులు హెచ్చరించారు. దీంతో మనస్తాపానికి గురైన బుచ్చమ్మ ఆత్మహత్య ఆత్మహత్య చూసుకొని చనిపోయింది. ప్రతి రూపాయ పోగువేసి కట్టి ఇల్లు తన ముగ్గురు కూతురు లకు కట్నం గా ఇచ్చిందని కుటుంబ బంధువులు తెలిపారు. అధికారులు కూల్చివేస్తాం చెప్పడంతో మనస్థాపానికి గురై ఆత్మహత్య చేసుకుందామా సమీప బంధువులు తెలిపారు.




# ఫ్రైడే డ్రై డే లో భాగంగా హమాలీ బస్తీ స్పెషల్ డ్రైవ్

**వారధి న్యూస్, హైదరాబాద్ :** సికింద్రాబాద్ జిహెచ్ఎంసి ఫ్రైడే డ్రై డే లో భాగంగా ఏంటమలాజీ సిబ్బంది శుక్రవారం పద్మారావు నగర్ హమాలీ బస్తి లో స్పెషల్ డ్రైవ్ నిర్వహించారు. ప్రతి శుక్రవారం ప్రతి ఒక్కరూ ఇంటి ఆవరణలో నీరు నిల్వ లేకుండా డ్రై గా ఉంచుకోవాలని స్థానికులకు అవగాహన కల్పించారు. ఏంటమాలజి అధికారులు శ్రీనివాస్ రెడ్డి, ఎస్. రాజేందర్ రెడ్డి, ఎం డి సాదిక్, దయానంద్, అంగనవాడి టీచర్లు పాల్గొన్నారు.

# పర్యాటక ప్రాంతాలుగా హెరిటేజ్ భవనాలు




**తరువాయిభాగం**

ముందుకొచ్చాయి.

**విద్యార్థులకు ఫ్రీ టూర్..**

రాష్ట్రంలోని చారిత్రక, పర్యాటక ప్రాంతాలపై విద్యార్థులకు అవగాహన కల్పించేందుకు రూపొందించిన "తెలంగాణ దర్శిని" కార్యక్రమానికి సంబంధించిన జీవోను జారీ చేసినట్లు సీఎం రేవంత్ తెలిపారు. ఈ కార్యక్రమంలో రెండో తరగతి నుంచి డిగ్రీ వరకు ప్రభుత్వ సంస్థలలో చదివే విద్యార్థులను కేటగిరీలుగా విభజించి, ఆయా ప్రాంతాల్లోని పర్యాటక క్షేత్రాలను ఉచితంగా చూపిస్తారు. రవాణా, ఇతరత్రా ఖర్చుల కోసం ప్రభుత్వం రూ12.10 కోట్ల నిధులను సైతం విడుదల చేసింది.

**మూసీ పరిధిలోని చారిత్రక భవనాల అభివృద్ధి**

హైదరాబాద్ సంస్కృతిని ప్రతిబింబించే కట్టడాల పరిరక్షణకు ముందుకు రావాలని పారిశ్రామికవేత్తలను సీఎం రేవంత్ రెడ్డి కోరారు. రాష్ట్రంలో సంక్షేమంతో పాటు పర్యాటక రంగాన్ని కూడా ముందుకు తీసుకెళతామన్నారు. మూసీ ప్రక్షాళన కార్యక్రమాన్ని ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా తీసుకుందని, మూసీ పరీవాహకంలోని చారిత్రక భవనాలను పర్యాటక ప్రాంతాలుగా తీర్చిదిద్దనున్నట్లు సీఎం తెలిపారు. గత ప్రభుత్వాల నిర్లక్ష్యం వల్ల నగరంలోని అనేక చారిత్రక కట్టడాలు శిథిలావస్థకు చేరుకున్నాయని సీఎం అన్నారు.

పాత అసెంబ్లీ భవనాన్ని పునరుద్ధరిస్తున్నామని, త్వరలోనే అందులో శాసన మండలిని ఏర్పాటు చేయనున్నట్లు సీఎం తెలిపారు. ప్రస్తుతం శాసనమండలి కొనసాగుతున్న చారిత్రక ప్రాధాన్యం ఉన్న జూబ్లీహాల్‌ను పరిరక్షించాల్సిన అవసరముందని రేవంత్ రెడ్డి అభిప్రాయపడ్డారు. ప్రత్యేక సాంకేతిక పరిజ్ఞానంతో నిర్మించిన జూబ్లీహాల్‌ను దత్తత తీసుకొని పరిరక్షించాలని సీఐఐకి ముఖ్యమంత్రి సూచించారు.ఉస్మానియా ఆస్పత్రిని గోషామహల్‌కు తరలించి ప్రస్తుత భవనాన్ని పరిరక్షించేందుకు అవసరమైన చర్యలు తీసుకుంటున్నట్లు సీఎం తెలిపారు. హైకోర్టు భవనం, సిటీ కాలేజ్ భవనం, పురానాపూల్ బ్రిడ్జి వంటి చారిత్రక కట్టడాలను పరిరక్షించుకోవాల్సిన అవసరముందన్నారు. ఇప్పటికే చార్మినార్ పరిరక్షణ ప్రాజెక్ట్ కొనసాగుతోందని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి పేర్కొన్నారు. ప్రభుత్వ పాఠశాలల్లో చదివే విద్యార్థులు ఉచితంగా పర్యాటక, చారిత్రక ప్రాంతాలను సందర్శించే అవకాశం కల్పిస్తున్నట్లు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి తెలిపారు.

# ఆపరేషన్ మూసీ ఉద్రిక్తం

**వారధి, స్టేట్ బ్యూరో:**

మూసీ సుందరీకరణలో భాగంగా నదీ గర్భంతో పాటు పరివాహక ప్రాంతంలో ఉన్న ఇళ్లు, అపార్ట్‌మెంట్ల తొలగింపునకు చేపట్టిన 'ఆపరేషన్ మూసీ' మరింత ఉద్రిక్తంగా మారింది. తమ ఇళ్లపై సర్వే చేయవద్దంటూ నిరసన తెలుపుతున్న నివాసితులు శుక్రవారం నాడు సర్వే చేస్తున్న అధికారులపై దాడి చేశారు. దీంతో అధికారులు భయంతో పరుగులు తీశారు. ఆందోళనల్లో భాగంగా లంగర్ హౌజ్ ప్రాంత వాసులు హైడ్రాకు వ్యతిరేకంగా నిరసన ర్యాలీ చేపట్టారు. 'రేవంత్ రెడ్డి డౌన్ డౌన్' అంటూ నినాదాలు చేశారు. పెద్ద ఎత్తున గో బ్యాక్ నినాదాలు చేయడంతో అధికారులు వెనుదిరిగి వెళ్లిపోయారు. మరోవైపు బహదూర్‌పురాలో బాధితులు తహసీల్దార్ కార్యాలయాన్ని ముట్టడించి ఆందోళన నిర్వహించారు. తమకు డబుల్ బెడ్‌రూమ్ ఇళ్లు వద్దని.. తమ నివాసాల్లోనే తాము ఉంటామని ఆగ్రహం వ్యక్తం చేశారు.

**పెట్రోల్ పోసుకుని ఆత్మహత్యాయత్నం**

మరోవైపు చైతన్యపురి సత్య నగర్‌లో ఉద్రిక్తత వాతావరణం నెలకొంది. మూసీ రివర్ బెడ్ నిర్మాణాలు గుర్తించి రెవిన్యూ అధికారులు మార్కింగ్ చేపట్టారు. మార్కింగ్ చేస్తున్న అధికారులను స్థానికులు అడ్డుకుంటున్నారు. భారీ పోలీస్ బందోబస్తుతో మార్కింగ్ ప్రక్రియ కొనసాగింది. తమ ఇళ్లపై మార్కింగ్ చేయొద్దని పెట్రోల్ పోసుకుని బాధితులు ఆత్మహత్యాయత్నం చేయడంతో అక్కడ తీవ్ర ఉద్రికత్త పరిస్థితులు నెలకొన్నాయి. దీంతో పోలీసులు బాధితుడిని అడ్డుకుని ఆసుపత్రికి తరలించారు. మరోవైపు మూసీ నివాసితుల ప్రాంతాల్లో ఉద్రిక్తత కొనసాగుతోంది. ఇళ్లకు మార్కింగ్ వేయకుండా మూసీ నివాసిత ప్రజలు అధికారులను వెనక్కి పంపిస్తున్నారు. దీంతో కొత్తపేట మారుతి నగర్‌లో అధికారుల మూసీ సర్వే నిలిచిపోయింది. ఇక.. మూసీ పరివాహక ప్రాంత బాధితులకు వనస్థలిపురం డబుల్ బెడ్ రూం ఇండ్లకు తరలించారు. దీంతో వారు తీవ్ర ఆవేదన వ్యక్తం చేశారు. తాగడానికి నీరు లేక వాటర్ బాటిల్స్ కొనుక్కొని తాగే పరిస్థితి వచ్చిందన్నారు. నివాసానికి కనీస వసతులు ఏర్పాటు చేయకుండా.. దిల్‌సుఖ్‌నగర్ మూసీ పరివాహక ప్రాంతం నుండి వనస్థలిపురానికి తరలించారని మండిపడ్డారు.



**తహసీల్దార్ కార్యాలయం ముట్టడి**

హైదరాబాద్ పాతబస్తీ బహదూర్‌పురా నియోజకవర్గం పరిధిలోని కిషన్ బాగ్, అసద్ బాబానగర్, నంది ముసలైగూడ మూసీ రివర్ బెడ్ పరిధిలో నివసిస్తున్న ఇండ్ల వాసులు తమ ప్రాంతాల నుంచి ర్యాలీగా వచ్చి బహదూర్‌పురా తహసీల్దార్ కార్యాలయం వద్దకు చేరుకుని నిరసన తెలిపారు. తమ ఇళ్లను కూల్చొద్దని డిమాండ్ చేశారు. తమకు వేరే చోట ప్రభుత్వం ఇచ్చే డబుల్ బెడ్‌రూం ఇళ్లు అవసరం లేదని ప్రభుత్వానికి వ్యతిరేకంగా తమ నిరసన తెలియజేశారు. వారికి మద్ధతుగా పలువురు స్థానికులు వచ్చారు. మూసీ నది రివర్ బెడ్‌లోకి హైదరాబాద్ బహదూర్‌పురా నియోజకవర్గంలోని కిషన్ బాగ్ అసద్ బాబ నగర్, ముసలైగూడ ప్రాంతాల్లోని దాదాపు 387 ఇళ్లు వస్తున్నాయి. గురువారం రెవెన్యూ అధికారులు సర్వే చేసి మూసీ రివర్ బెడ్‌లోకి వస్తున్న ఇళ్లలో ఉన్న వారి వివరాలు సేకరించి మార్కింగ్ చేసి బాధితులకు డబుల్ బెడ్ రూం ఇళ్లు ఇస్తామని హామీ ఇచ్చారు.



# దసరా లోపు రుణమాఫీ చేయాల్సిందే

**వారధి న్యూస్, సిద్దిపేట:**

గత అసెంబ్లీ ఎన్నికల సందర్భంగా కాంగ్రెస్ రైతులకు రుణ మాఫీ హామీ ఇచ్చింది. ఇచ్చిన మాట ప్రకారం అన్నదాతలకు రూ.2 లక్షల వరకు రుణ మాఫీ చేసినట్లు ప్రభుత్వం ప్రకటించింది. అయితే క్షేత్రస్థాయిలో చూస్తే చాలా మందికి రుణ మాఫీ కాలేదని తెలుస్తోంది. చాలా మంది అన్నదాతలు తమకు రుణ మాఫీ కాలేదని ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. రోడ్లెక్కి ఆందోళన చేస్తున్నారు. తమకు రుణ మాఫీ చేయాలని డిమాండ్ చేస్తున్నారు. రైతులకు మద్దతుగా బీజేపీ, బీఆర్ఎస్ వస్తున్నాయి. ఇప్పటికే బీఆర్ఎస్ రుణ మాఫీ చేయాలని చలో ప్రజాభవన్‌కు పిలుపునిచ్చిన సంగతి తెలిసిందే. తాజాగా బీఆర్ఎస్ సీనియర్ నేత, మాజీ మంత్రి హరీశ్ రుణ మాఫీపై ప్రభుత్వాన్ని నిలదీశారు. దసరాలోపు రుణ మాఫీ చేయాలన్నారు. లేకుంటే రైతులతో కలిసి పోరాటం చేస్తామని హెచ్చరించారు. సిద్దిపేట జిల్లా నంగునూరులో రుణ మాఫీ చేయాలని రైతులు దీక్ష చేస్తున్నారు. హరీశ్ రావు అన్నదాతలకు మద్దతుగా దీక్షలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. రైతులకు రూ.2 లక్షల రుణమాఫీ జరిగే వరకు తాను నిద్రపోనని, సీఎం రేవంత్ రెడ్డిని నిద్రపోనీయనని బీఆర్ఎస్ సీనియర్ నేత, మాజీ మంత్రి హరీష్‌రావు అన్నారు. రైతుబంధు కేసీఆర్ హయంలో నాట్లకు అందిస్తే, ఈ ప్రభుత్వం పంట కోతకు వచ్చినా రైతుబంధు రాలేదని విమర్శించారు. కాంగ్రెస్ హయంలో దొంగరాత్రి కరెంట్ ఇస్తుంటే.. కేసీఆర్ కడుపు నిండా కరెంట్ ఇచ్చారని అన్నారు.

**సీఎంను వదిలే ప్రస్తకే లేదు..**

రైతులందరీకి రుణ మాఫీ చేసే వరకు ప్రభుత్వాన్ని వదిలిపెట్టే ప్రసక్తే లేదన్నారు. రైతులతో కలిసి సచివాలయాన్ని ముట్టడిస్తామని హెచ్చరించారు. తెలంగాణలో రైతు ఆత్మహత్యలు పెరిగిపోయాయని చెప్పారు. రైతు భరోసా ఎప్పుడు ఇస్తారో చెప్పాలని డిమాండ్ చేశారు. రాష్ట్రంలో ఇప్పటి వరకు దాదాపు 21 లక్షల మంది రైతులకు ఇంకా రుణ మాఫీ కాలేదన్నారు. లెక్క ప్రకారం రుణ మాఫీ చేయాలంటే రూ.31 వేలు కోట్ల కావాలని ప్రభుత్వం అంచనా వేసింది. అయితే రూ.18 వేల కోట్లకు పైగా మాత్రమే విడుదల చేసినట్లు బీజేపీ, బీఆర్ఎస్ నేతలు చెబుతున్నారు. మిగతా వారికి ఎప్పుడు రుణ మాఫీ చేస్తారో చెప్పాలని డిమాండ్ చేశారు. కేసీఆర్ హయంలో రైతుబంధు నాట్లకు అందిస్తే, ఈ ప్రభుత్వంలో పంట కోతకు వచ్చినా రైతుబంధు రాలేదన్నారు. దసరా పండగ లోపు రుణమాఫీ చేయకుంటే రైతులంతా హైదారాబాద్‌కు వచ్చి సెక్రటేరియట్ ముట్టడిస్తామని హరీష్ రావు కాంగ్రెస్ ప్రభుత్వానికి హెచ్చరించారు.

# నిర్వహణా లోపమే శాపం

**వారధి, స్టేట్ బ్యూరో:**



కాళేశ్వరం ప్రాజెక్టు నిర్మాణ అవకతవకలపై ఏర్పాటు చేసిన జస్టిస్ పీసీ ఘోష్ కమిషన్ దర్యాప్తు వేగంగా జరుగుతోంది. ఇవాళ గజ్వేల్ ఈఎన్సీ, కాళేశ్వరం కార్పొరేషన్ ఎండీ హరిరామ్‌ను విచారించింది. ప్రాజెక్టు నిర్మాణంపై జస్టిస్ పీసీ ఘోష్, ఈఎన్సీ హరిరామ్‌ను 90కి పైగా ప్రశ్నలను అడిగారు. అలాగే ప్రాజెక్టు నిర్మాణ బిల్లుల చెల్లింపులకు ఏర్పాటు చేసిన కాళేశ్వరం కార్పొరేషన్ ఆర్థిక అంశాలపై సైతం కమిషన్ ఆరా తీసింది.

శనివారం మరోసారి కమిషన్ ముందు హరిరామ్ హాజరుకానున్నారు. ఇవాళ సమాధానం చెప్పని ప్రశ్నలకు రేపు డాక్యుమెంట్స్ సమర్పిస్తామని ఆయన తెలియజేశారు. విచారణలో జస్టిస్ పీసీ ఘోష్ కమిషన్ ఎదుట హరిరామ్, అప్పటి తెలంగాణ సీఎస్ ఎస్‌కే జోషి, ఈఎన్సీ మురళీధర్ పేర్లను ప్రస్తావించారు. ఇప్పటి వరకు కార్పొరేషన్ ద్వారా బ్యాంకులకు 29,737 కోట్ల రూపాయలు వరకు తిరిగి చెల్లించినట్లు వివరణ ఇచ్చారు. బ్యాంకుల నుంచి తీసుకున్న డబ్బుల్లో 64 వేల కోట్ల రూపాయలు గుత్తేదారులకు చెల్లింపులు జరిగాయని ప్రస్తావించారు.

కార్పొరేషన్ ఫైనాన్షియల్ స్టేట్ మెంట్లను ప్రభుత్వానికి ఇచ్చామని, అది శాసనసభలో పెట్టారా? లేదా? అనేది తనకు ఏమీ తెలియదని హరిరామ్ వివరించారు. మేడిగడ్డ బ్యారేజీ డామేజ్‌కు బాధ్యులు ఎవరని ఘోష్ కమిషన్, హరిరామ్‌ను ప్రశ్నించింది. ఈ నేపథ్యంలో గేట్స్ ఆపరేషన్, మెయింటెనెన్స్ సరిగ్గా లేకపోవడమే ప్రధాన కారణమన్న హరిరామ్, 2017 సంవత్సరం నాటి ఉన్నత స్థాయి కమిటీ మినట్స్‌ను కాళేశ్వరం చీఫ్ ఇంజినీర్ ఫాలో కాలేదని ఆయన స్పష్టం చేశారు. మరోవైపు పీసీ ఘోష్ కమిషన్ ఇప్పటికే కాళేశ్వరం కార్పొరేషన్ చీఫ్ అకౌంట్స్ అధికారులను ప్రశ్నించింది. కమిషన్ ముందు కాళేశ్వరం కార్పొరేషన్ చీఫ్ అకౌంట్స్ ఆఫీసర్ వెంకట అప్పారావు, చీఫ్ అకౌంట్ ఆఫీసర్ పద్మావతి, డైరెక్టర్ ఆఫ్ వర్క్స్ అకౌంట్ చీఫ్ ఫణిభూషణ్ శర్మ హాజరయ్యారు. గతంలో దాఖలు చేసిన అఫిడవిట్ల ఆధారంగా వారి నుంచి పలు వివరాలపై ఆరా తీసింది.

# హైదరాబాద్‌లో.. బ్యానర్లు, కటౌట్లు బంద్

**తరువాయిభాగం**

వాల్ పోస్టర్స్ అంటించడం, వాల్ రైటింగ్ లాంటివి చేస్తే భారీ జరిమానాలు వేస్తామని వార్నింగ్ ఇచ్చారు. గ్రేటర్ హైదరాబాద్ పరిధిలో పోస్టర్లు బ్యాన్ చేస్తూ నిర్ణయం తీసుకున్నట్లు తెలిపారు. వాల్ పోస్టర్లు, వాల్ పెయింటింగ్స్ పై సీరియస్‌గా వ్యవహరించాలని సర్క్యులర్ జారీ చేసినట్లు ఆమె వెల్లడించారు. అంతేకాకుండా.. సినిమా థియేటర్ వాళ్ళు కూడా ఎక్కడా పోస్టర్లు అతికించకుండాచూడాలని డిప్యూటీ కమిషనర్లకు ఆదేశించారు కమిషనర్ ఆమ్రపాలి. ఒకవేళ పోస్టర్లు వేస్తే మాత్రం జరిమానా విధించాలని కమిషనర్ ఆమ్రపాలి ఆదేశించారు. మరోవైపు.. మతపరమైన కార్యక్రమాల్లో డీజేల వాడకం.. మితిమీరిన సౌండ్స్, నృత్యాల విషయంలోనూ ప్రభుత్వం కీలక నిర్ణయం దిశగా అడుగులు వేస్తోంది. ఇప్పటికే.. హైదరాబాద్ సీపీ సీవీ ఆనంద్ అధ్యక్షతన రాజకీయ నేతలు, మతసంఘాల నాయకులతో సమావేశం నిర్వహించి.. డీజేల బ్యాన్ విషయంపై చర్చించారు. త్వరలోనే.. ప్రభుత్వానికి ఈ డీజేల బ్యాన్ అంశం మీద నివేదిక ఇస్తామని సీపీ సీవీ ఆనంద్ తెలిపారు. ఈ విషయం కూడా ఇప్పుడు హైదరాబాద్‌లో సర్వత్రా చర్చనీయాశంగా మారిన విషయం తెలిసిందే.



# హైదరాబాద్ టు అయోధ్య

**వారధి, స్టేట్ బ్యూరో:**

హైదరాబాద్ టు అయోధ్య మధ్య వారానికి నాలుగు రోజుల విమాన సర్వీస్ నడవనుందని, ఉడాన్ పథకం కింద హైదరాబాద్ నుంచి ఒక్క నెలలో ఏడు సర్వీసులు ప్రారంభమయ్యాయని తెలంగాణ బీజేపీ అధ్యక్షుడు, కేంద్ర బొగ్గు, గణుల శాఖ మంత్రి జి.కిషన్ రెడ్డి అన్నారు. హైదరాబాద్ నుంచి నడపనున్న కొత్త విమాన సర్వీసుల టైం టేబుల్ ను ట్విట్టర్ వేదికగా పోస్ట్ చేసిన ఆయన పలు ఆసక్తికర వ్యాఖ్యలు చేశారు. ఈ సందర్భంగా ఆయన.. నూతన విమానాశ్రయాలను అభివృద్ధి చేయడమే కాకుండా ఆయా పట్టణాలకు అతి తక్కువ ధరలోనే విమాన సర్వీసులను నడపడానికి అనుగుణంగా ఉడాన్ పథకంలో భాగంగా.. హైదరాబాద్ నగరం నుంచి ఒక్క నెలలోనే 7 నూతన విమాన సర్వీసుల ప్రారంభమయ్యాయని తెలిపారు.అలాగే ఇందులో భాగంగా ఇవ్వాల్టి నుంచి (సెప్టెంబర్ 27) హైదరాబాద్ కాన్పూర్ మధ్యన, హైదరాబాద్ నుంచి శ్రీరాముడు కొలువుదీరిన అయోధ్య మధ్యన వారానికి 4 రోజుల సర్వీసును, రేపటినుంచి (సెప్టెంబర్ 28) హైదరాబాద్ ప్రయాగరాజ్ మధ్యన, హైదరాబాద్ ఆగ్రా మధ్యన వారానికి 3 రోజుల సర్వీసులు ప్రారంభమయ్యాయని తెలిపారు. కాగా కేంద్రప్రభుత్వం ఉడాన్ పథకం కింద పలు ప్రాంతాల్లో కొత్త విమాన సర్వీసులను ప్రారంభించింది. అందులో హైదరాబాద్ నుంచి ఏడు సర్వీసులు శుక్రవారం నుంచి ప్రారంభమయ్యాయి. ఈ కొత్త సర్వీసులు, ప్రయాణికులకు తక్కువ ధరలలో ప్రయాణం చేయడానికి, ఎక్కువ పట్టణాలకు విమాన సౌకర్యాలను అందించడంలో కీలక పాత్ర పోషిస్తాయి.

వారధి
తెలుగు దిన పత్రిక
www.varadhinews.com
GENERAL NEWS
జనరల్ న్యూస్




## సంత స్థలాన్ని ప్లాట్లు గా అమ్ముకుంటున్నారు అప్పండి

- సిపిఎం

**వారధి న్యూస్, పెబ్బేరు:** భారత కమ్యూనిస్టు పార్టీ (మార్క్సిస్ట్) సిపిఎం పెబ్బేరు శాఖ మహాసభ శుక్రవారం హమాలి నిర్వహించారు. పార్టీ జెండాను సిపిఎం మాజీ ఎంపీటీసీ సీనియర్ నాయకులు జి బాలయ్య ఆవిష్కరించారు. మహాసభలో సిపిఎం వనపర్తి జిల్లా కార్యదర్శి ఎం డి జబ్బార్ మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్నికలకు ముందు ఇచ్చిన హామీలను పూర్తి ఆ విఫలమైందన్నారు. ప్రభుత్వం ప్రకటించిన ఆరు గ్యారెంటీలలో ఒకటి మాత్రమే అమలు చేశారు. ఇంకా ఐదు హామీలు నామమాత్రంగానే అమలవుతున్నాయని ఆరు గ్యారెంటీలను వెంటనే అమలు చేయాలన్నారు. ఏకకాలంలో రైతులకు రుణమాఫీ రెండు లక్షల చేస్తామని చెప్పి అనేక కొరివిలు పెట్టిందని దీనితో రైతులు అనేక ఇబ్బందులు పడుతున్నారని వెంటనే రెండు లక్షల రుణమాఫీని అమలు చేయాలని డిమాండ్ చేశారు. లేనిపక్షంలో సిపిఎం పార్టీ ఆధ్వర్యంలో పోరాటాలు నిర్వహిస్తామని రాష్ట్ర ప్రభుత్వాన్ని హెచ్చరించారు. పెబ్బేరు పట్టణంలో ఉన్న సంత స్థలాన్ని కొంతమంది వ్యక్తులు ఆక్రమించుకొని రియల్ ఎస్టేట్ చేస్తున్నారని వెంటనే ఆ స్థలాన్ని ప్రభుత్వం వినియోగంలోకి తేవాలని డిమాండ్ చేశారు. పెబ్బేరు నుండి వనపర్తి వరకు బీటీ రోడ్డును వెంటనే వేయాలని వెంకటాపురం చెలిమిల్ల దగ్గర ఉన్న బ్రిడ్జిలను వెంటనే పూర్తిచేయాలని డిమాండ్ చేశారు. పెబ్బేరు మండలంలో పెండింగ్లో ఉన్న డబల్ బెడ్ ఇళ్లను అర్హులను గుర్తించి అందజేయాలని లేనిపక్షంలో పోరాటాలు చేస్తామని ఆయన అన్నారు. కార్యక్రమంలో సిపిఎం జిల్లా కమిటీ సభ్యులు మండ్ల రాజు, సిపిఎం పెబ్బేరు శాఖ కార్యదర్శి గా ఎం డి పెద్ద ఖాజా ను ఎన్నుకోవడం జరిగింది. కార్యక్రమంలో సిపిఎం మాజీ ఎంపీటీసీ జి బాలయ్య, దేవన్న, వెంకటస్వామి, ఉషన్న, చంద్రశేఖర్, హుస్సేన్, బాల పేరు, తదితరులు పాల్గొన్నారు.



## ఆల్ ఓవర్ ఛాంపియన్స్గా కొండాపూర్ గురుకుల విద్యార్థులు

**వారధి న్యూస్, మహబూబ్ నగర్:** నారాయణపేట జిల్లా ధన్వాడ మండలం కొండాపూర్ గిరిజన గురుకుల విద్యార్థులు ఎస్ జీ ఎఫ్ క్రీడలలో తమ ప్రతిభ పాటవాలు చాటారు. శుక్రవారం ధన్వాడలో జరిగిన పోటీలలో వాలీబాల్, కబడ్డీ, ఖోఖో తదితర అన్ని విభాగాలలో తమ ప్రతిభ ప్రదర్శించి బహుమతులు అందుకున్నారు. ఈ సందర్భంగా విద్యార్థులను గురుకులం ప్రిన్సిపాల్ ఎం. రాజారాం, వైస్ ప్రిన్సిపాల్ శ్రీనివాస్, పీఈటీ సుగుణాకర్, పీఈడీ రాంమోహన్ గౌడ్ అభినందించారు. ఈ సందర్భంగా విజేతలకు ఎస్ జీ ఎఫ్ నిర్వాహకులు ట్రోఫీని అందజేశారు.



## బాల సదన్ విద్యార్థులకు తన వంతు సహకారాన్ని అందిస్తా

- జిల్లా ప్రధాన న్యాయమూర్తి రాజేష్ బాబు

**వారధి న్యూస్,నాగర్ కర్నూలు బ్యూరో:** అచ్చంపేట బాలసదన్ లో విద్యను అభ్యసిస్తున్న విద్యార్థులకు తన వంతు వ్యక్తిగత సహాయాన్ని అందించి వారు భవిష్యత్తులో మంచి స్థాయిలో స్థిరపడేందుకు తన వంతు సహాయ సహకారాలు అందిస్తానని నాగర్ కర్నూల్ జిల్లా ప్రధాన న్యాయమూర్తి రాజేష్ బాబు అన్నారు.శుక్రవారం అచ్చం పేట పట్టణంలోని బాలసదన్ ను సందర్శించి అక్కడ చిన్నారులకు పళ్ళు అందజేసి వారి యొక్క స్థితిగతులు తెలుసుకొని బాలసదన్ లో ఉన్న ప్రతి చిన్నారికి చక్కటి వైద్యం విద్య మరియు ఇతర రంగాలలో అవకాశాలు వచ్చేలా చూడాలని అందుకోసం తాను తప్పకుండా వారికి వ్యక్తిగతంగా సహాయం కూడా అందిస్తానని అన్నారు. అచ్చంపేట జూనియర్ సివిల్ జడ్జి కోర్టుని సందర్శించిన జిల్లా ప్రధాన న్యాయమూర్తి రాజేష్ బాబు ఈ సందర్భంగా వారు న్యాయవాదులతో కలిసి కోర్టులో ఉన్న సమస్యల పైన చర్చించారు మరియు నేషనల్ లోక్ అదాలతో లో కేసులని త్వరితగతిన పరిష్కరించాలని కోరారు. ఈ కార్యక్రమంలో అచ్చంపేట జూనియర్ సివిల్ జడ్జ్ శ్రీ విజయకుమార్ మరియు బార్ అసోసియేషన్ అధ్యక్షులు గంగాపురం రాజేందర్, కార్యదర్శి కౌసర్, సీనియర్ న్యాయవాదులు భాస్కర్ రెడ్డి, సత్తయ్య, వెంకటశెట్టి, మస్తాన్, వెంకటరమణ, వెంకటేష్, తదితరులు పాల్గొన్నారు.

## అభ్యర్థుల ధ్రువపత్రాల పరిశీలన

**వారధి న్యూస్ మహబూబ్ నగర్,** మహబూబ్నగర్ ఉమ్మడి జిల్లా కు చెందిన DSC 2008 అభ్యర్థుల ఒరిజినల్ ధ్రువపత్రాల పరిశీలన శుక్రవారం ప్రారంభమైంది. ఇదే రోజు 82 మంది అభ్యర్థుల దృవపత్రాలను జిల్లా విద్యాశాఖ అధికారి కార్యాలయంలో పరిశీలన చేయడం జరిగినది. మిగిలిన దృవపత్రాలను అక్టోబర్ 5వ తారీఖు వరకు జిల్లా విద్యాశాఖ అధికారి కార్యాలయంలో పరిశీలించబడును. ప్రతి రోజు 10:30 నుండి సాయంత్రం 5 గంటల వరకు పరిశీలన జరుగుతుంది. కావున అభ్యర్థులందరూ కూడా ఈ యొక్క అవకాశాన్ని అభ్యర్థులు సద్వినియోగపరుచుకోవాల్సిందిగా కోరారు

## మిషన్ భగీరథ నీటిపై ప్రజల్లో నమ్మకం కలిగించాలి

- సరఫరా సహాయకుల శిక్షణ కార్యక్రమంలో ఎమ్మెల్యే డా. వంశీకృష్ణ

**వారధి న్యూస్,నాగర్ కర్నూలు బ్యూరో:** ఇంటింటికి సరఫరా చేస్తున్నా మిషన్ భగీరథ నీటిపై ప్రజల్లో నమ్మకం కలిగించాలని స్థానిక ఎమ్మెల్యే డాక్టర్ వంశీకృష్ణ అన్నారు. శుక్రవారం మండల పరిధిలోని నడింపల్లి రైతు వేదికలో నీరు సహాయకుల శిక్షణ కార్యక్రమంలో ఎమ్మెల్యే పాల్గొని మాట్లాడారు. ఏజెన్సీ పల్లెలలో మారుమూల గ్రామాలలో త్రాగునీటి సమస్యలకు ఇబ్బందులు లేకుండా సరఫరా చేయాలన్నారు. మిషన్ భగీరథ నీరు ప్రజలు తాగడం లేదు అధికారులు గ్రామాలలో అవగాహన కల్పించి భగీరథ నీరు గురించి చెప్పాలన్నారు. పైపులైన్ల లీకేజీలు నివారించాలని, బోరు మోటర్ నిర్వహణ, చేతిపంపుల మరమ్మత్తులపై మూడు రోజులుగా సరఫరా సహాయకులకు శిక్షణ జరుగుతుంది. డిఈ హేమలత మాట్లాడరు నీళ్లలో మూడు రోజులు కచ్చితంగా శుభ్రం చేయాలని, క్లోరినేషన్ పరీక్షల వివరాలను రిజిస్టర్లో నమోదు చేయాలన్నారు. మిషన్ భగీరథ నీరు సురక్షితమని ప్రజలకు చెప్పాలని సిబ్బందికి సూచించారు.కార్యక్రమంలో సరఫరా సహాయకులు ఉన్నారు.

## జిల్లాస్థాయిలో కౌమార విద్య పై ఉపాధ్యాయులకు శిక్షణ



**వారధి న్యూస్,నాగర్ కర్నూలు బ్యూరో:** రాష్ట్ర విద్యా శాఖ , జిల్లా విద్యాశాఖ నాగర్ కర్నూల్ మరియు తెలంగాణ రాష్ట్ర ఎయిడ్స్ నియంత్రణ సంస్థ సహకారంతో జిల్లాస్థాయిలో కౌమార విద్య పై ఉపాధ్యాయులకు శిక్షణ మరియు విద్యార్థులకు పోస్టర్ మేళా స్థానిక లిటిల్ ఫ్లవర్ హై స్కూల్ లో శనివారం నిర్వహించడం జరిగిందని జిల్లా సైన్స్ అధికారిఈ కార్యక్రమంలో జిల్లాలో వున్న 83 పాతశాల విద్యార్థులు ఉపాధ్యాయులు పాల్గొన్నారు. తెలిపారు.ఈ సందర్భంగా జిల్లా సైన్స్ అధికారి రాజశేఖర్ రావు మాట్లాడుతూ జిల్లాలో 63 ప్రభుత్వ ఉన్నత 4 కస్తూర్బా గాంధీ, 5 మోడల్,8ప్రైవేటు సీసీ. పాతశాలలో కౌమార విద్యా కార్యక్రమంలో భాగంగా కౌమార దశలో బాల, బాలికలకు కలిగే శారీరక మానసిక, ఉద్వేగ పరమైన మార్పుల గురించి విద్యార్థులకు పూర్తిస్థాయి అవగాహన కల్పించనున్నట్లు తెలిపారు. జిల్లా అకడమిక్ మానిటరింగ్ అధికారి శర్ఫుద్దీన్ గారు మాట్లాడుతూ హెచ్ఐవి, ఎస్ టి ఐ సంక్రమిత వ్యాధుల నివారణకు అవసరమైన జీవన నైపుణ్యాలను పెంపొందించడం. మాదకద్రవ్యాల దుర్వినియోగానికి ఇతర ప్రమాదకర ప్రవర్తనలకి ఉన్న సంబంధాలను, లైంగిక వేధింపులు, భావవ్యక్తీకరణ ద్వారా వ్యక్తుల మధ్య ఆరోగ్యవంతమైన సంబంధాలు ఏర్పాటు చేసుకోవడం మరియు కౌమారానికి సంబంధించిన వివిధ అంశాలపై పాఠశాల స్థాయిలో విద్యార్థులకు అవగాహన కల్పించనున్నట్లు తెలిపారు. అనంతరం పోస్టర్ మేళాలో గెలుపొందిన విమల హై స్కూల్ అచ్చంపేట ఈశ్వర్ చంద్ర విద్యార్థి కి ప్రథమ మరియు రాకిఫ్ ZPHS గాంధీ మోడల్ స్కూల్ విద్యార్థికి ద్వితీయ బహుమతులు ప్రశంస పత్రాలు అందజేశారు. ఈ కార్యక్రమంలో ఎయిడ్స్ నియంత్రణ మరియు నివారణ విభాగం అధికారి రవీందర్ రెడ్డి, జిల్లా సైన్స్ అధికారి రాజశేఖర్ రావు , విద్యాశాఖ క్వాలిటీ కోఆర్డినేటర్ శర్ఫుద్దిన్, ఈ కార్యక్రమానికి జడ్జి గా వ్యవహరించిన వెంకటేశ్వర రావు గారు ఇతర ఉపాధ్యాయులు , విద్యార్థులు పాల్గొన్నారు



## బెదిరింపులకు పాల్పడుతున్న బుద్ధారం మురాహరిని శిక్షించాలి

**వారధి న్యూస్,నాగర్ కర్నూలు బ్యూరో:** వికలాంగుల పై బెదిరింపులకు పాల్పడుతున్న బుద్ధారం మురా హరి నీ కఠినంగా శిక్షించాలని వికలాంగుల పరిరక్షణ సమితి నాయకులు డిమాండ్ చేశారు శుక్రవారం జిల్లా కేంద్రంలో సీఐ కనకయ్య కు ఫిర్యాదు చేశారు. ఈ సందర్భంగా వికలాంగుల సంఘం అధ్యక్షుడు నారందాసు శ్రీశైలం కార్యదర్శి మొల్గర పరశురాములు మాట్లాడుతూ బంగారి పర్వతాలకు మద్దతుగా నిలుస్తే మీ అందరిపై అక్రమంగా కేసులు నమోదు చేయించి జైలుకు తరలించే విధంగా చూస్తానని నాయకులను బెదిరించడం సహించరాదని హెచ్చరించారు ఈ కార్యక్రమంలో నాయకులు శ్యాంసుందర్ కాశన్న సైదులు రాజు, శ్రీదేవి భారతి వెంకటస్వామి గణేష్ వెంకట్ తదితరులు పాల్గొన్నారు.



## ఆపదలో ఉన్నవారికి ఆపన్నహస్తం

**వారధి న్యూస్ మహబూబ్ నగర్,** మహబూబ్ నగర్ ఎమ్మెల్యే శ్రీ యెన్నం శ్రీనివాస్ రెడ్డి మహబూబ్ నగర్ డబుల్ బెడ్రూం ఇండ్లలో నివసిస్తున్న ఇందిర కేశవులు కుటుంబ వ్యక్తులు బీహార్ కు చెందిన వ్యక్తి రెండు నెలల క్రితం ఆసిడ్ దాడి చేయడం తో కేశవులు కుటుంబంలో ముగ్గురు వ్యక్తులు తీవ్రంగా గాయపడ్డారు. గాయపడ్డవారికి వైద్యానికి సహాయం అందిస్తానని ఎమ్మెల్యే హామీ ఇచ్చారు. ఎమ్మెల్యే ఆదేశానుసారం ఈరోజు కేశవులు కుటుంబానికి నెలకు సరిపడే బియ్యం, కిరాణా సామాగ్రిని కాంగ్రెస్ పార్టీ కార్యకర్తలు అందజేశారు. ధైర్యంగా ఉండాలని కేశవులు కుటుంబానికి భరోసా ఇచ్చారు. ఈ కార్యక్రమంలో రాజు భాయ్, రమేష్, మహేష్, లింగమయ్య తదితరులు ఉన్నారు.



## ఘనంగా కొండా లక్ష్మణ్ బాపూజీ జయంతి

**వారధి న్యూస్, మహబూబ్ నగర్:** గాంధీ స్ఫూర్తి తో దేశ స్వాతంత్ర ఉద్యమం లో పాల్గొని అవే విలువలను తమ జీవితాంతం పాటించి ప్రత్యేక తెలంగాణ రాష్టం కోసం పోరాడిన వ్యక్తి ఆచార్య కొండా లక్ష్మణ్ బాపూజీ అని మున్సిపల్ మాజీ చైర్మన్ నర్సింహులు పేర్కొన్నారు. ఆచార్య కొండా లక్ష్మణ్ బాపూజీ గారి జయంతి సందర్బంగా మహబూబ్నగర్ జిల్లా కేంద్రంలోని ఆయన విగ్రహానికి పూలమాలలు వేసి నివాళ్లు అర్పించారు. స్వాతంత్ర్య సమరయోధుడిగా తెలంగాణ స్వయంపాలన కోసం, ఆత్మగౌరవం కోసం పోరాటాలు నడిపిన తొలితరం ఉద్యమనేతగా పెరుగడించారని చెప్పారు. తెలంగాణ ప్రజల హక్కులు, రక్షణ స్వరాష్ట్ర సాధనతోనే సాధ్యమని బలంగా నమ్మిన వ్యక్తి అని అన్నారు. ఆయన జీవితం ప్రస్తుత తరానికి ఆదర్శమని తెలిపారు. కార్యక్రమంలో ముడా మాజీ చైర్మన్ గంజి వెంకన్న, పార్టీ పట్టణ అధ్యక్షులు శివరాజ్, కౌన్సిలర్ కట్ట రవి కిషన్ రెడ్డి , సీనియర్ నాయకులు శ్రీనివాస్ రెడ్డి, రమేష్ నాయక్, పాల సతీష్, వరద భాస్కర్, కిషన్ పవర్ తదితరులు పాల్గొన్నారు



## ఎస్సి వర్గీకరణ కు వ్యతిరేకంగా ఉద్యమించాలి

- మాల మహానాడు జాతీయ అధ్యక్షులు,
- ఎస్సీ వర్గీకరణ వ్యతిరేక పోరాట సమితి కన్వీనర్
- జి. చెన్నయ్య

**వారధి న్యూస్,నాగర్ కర్నూలు బ్యూరో:** మాలలు అంత ఐక్యమతం తో ఉండి ఎస్సీ వర్గీకరణ కు వ్యతిరేకంగా ఉద్యమం ఉధృతం చేయాలి అని మాల మహానాడు జాతీయ అధ్యక్షులు, ఎస్సీ వర్గీకరణ వ్యతిరేక పోరాట సమితి కన్వీనర్,జీ చెన్నయ్య పిలుపు నిచ్చారు... శుక్రవారం నాడు అచ్చంపేట రోడ్లు భవనాల అతిథి గృహంలో లో ఏర్పాటు చేసిన మాల మహానాడు ముఖ్య కార్యకర్తల సమావేశం లో మాట్లాడుతూ... బీజేపీ ప్రభుత్వం దళితుల ను విభజించి పాలించే కుట్ర లో భాగమే సుప్రీం కోర్టు తీర్పు అనీ అన్నారు. సుప్రీం కోర్టు తీర్పు కు వ్యతిరేకంగా ఉద్యమం తో పాటు న్యాయ పోరాటం చేస్తామని అన్నారు..... కమీషన్ ఏర్పాటు చేసి.. కుల గణం చేయాలి,, సిట్టింగ్ జడ్జితో కమిటీ ఏర్పాటు చేయాలి అని అన్నారు......తెలంగాణ ప్రభుత్వం ఏర్పాటు చేసిన సబ్ కమిటీ నీ వెంటనే రద్దు చేయాలని డిమాండ్ చేశారు.... జీ చెన్నయ్య గారి వెంట రాష్ట్ర ఎస్సీ వర్గీకరణ వ్యతిరేక పోరాట సమితి కో కన్వీనర్లు బూర్గుల వేంకటేశ్వర్లు, గోపోస్ రమేష్, రాష్ట్ర మాలమహా నాడు కార్యదర్శి మద్దెల దివాకర్, కుంద మల్లికార్జున్, మాల ఉద్యోగుల సంఘం అధ్యక్షుడు కల్మల ఆంజనేయులు,, స్వామీ, మౌలరం శ్రీనివాస్ ,తైలి బా లస్వామి, కిన్నెర పాండు, శ్రీధర్, వేద వ్యస్, శేఖర్, జీ అంజి, అరుణ్, కృష్ణ,వెంకట్ నారయణ, రవి, చక్ర పనీ తదితరులు పాల్గొన్నారు.



## మండల విద్యాశాఖ అధికారిని సన్మానించిన బిటి ఏ నాయకులు

**వారధి న్యూస్/నాగర్ కర్నూలు బ్యూరో:** అచ్చంపేట నూతన మండల విద్యాశాఖాధికారిగా భాధ్యతలు చేపట్టిన పంబలి జీవన్ కుమార్ ను శుక్రవారం బహుజన ఉపాధ్యాయ సంఘం (BTA) ఆద్వర్యంలో శాలువాతో ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో బిటిఏ నాయకులు పాల్గొన్నారు.

## జ్యువెలరీ షాపులో దొంగతనం చేసిన మహిళలు

- కేసు నమోదు రిమాండ్ కు తరలించిన పోలీసులు

**వారధి న్యూస్, నాగర్ కర్నూలు బ్యూరో:** అచ్చంపేట పట్టణంలోని శ్రీ వెంకటేశ్వర జ్యువలరీ షాపు లో దొంగతనం చేసిన మహిళలపై కేసు నమోదు చేసి రిమాండ్ కు తరలించినట్లు అచ్చం పేట ఎస్ ఐ రాము తెలిపారు.ఆయన తెలిపిన వివరాల ప్రకారం ఈ నెల 16న నలుగురు మహిళలు షాపులోకి వచ్చి అందులో ముగ్గురు మహిళలు లోపలికి వెళ్లి ఇద్దరు మహిళలు షాపు యజమాని అయిన ఆగేపల్లి వెంకటరమణ తో మాట్లాడుతూ వారి దృష్టిని మరల్చి అందులో ఒక మహిళ షాపులోని 10 జతల వెండి కాళ్ళపట్టీలు అందాజా వాటి విలువ 1,80,000/ నగలను దొంగిలించిన . ఇట్టి విషయంపై అచ్చంపేట స్టేషన్ లో ఫిర్యాదు చేయగా ,ల్ కేసు నమోదు చేసి, సీసీ కెమెరాలను పరిశీలించి, అన్ని విధాలుగా దర్యాప్తు చేసి, నిందితులు అయిన మూడవత్ బుజ్జి, మూడవత్ లక్ష్మి, మూడవత్ అస్లీ, స్వగ్రామం బాజీపూర్ తాండ మండలం తిమ్మాజీపేట వారీగా గుర్తించి, వారి నుండి అట్టి వెండి పట్టీలను 1కేజీ 45 గ్రామ్స్ ను రికవరీ చేసి వారిని అరెస్టు చేసి రిమాండ్ కు తరలించడం జరిగిందని ఆయన తెలిపారు



## ప్రధాని పుట్టినరోజు సందర్భంగా మొక్కలు నాటిన కార్యకర్తలు

**వారధి న్యూస్,నాగర్ కర్నూలు బ్యూరో:** ప్రధానమంత్రి నరేంద్రమోదీ జన్మదినం సందర్భంగా సేవా పక్వాడా కార్యక్రమంలో భాగంగా శుక్రవారం అమ్రాబాద్ మండల కేంద్రంలో మొక్కలు నాటారు. బీజేపీ జిల్లా ప్రధాన కార్యదర్శి గంగిశెట్టి నాగరాజు ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో సేవా పక్వాడా జిల్లా కో కన్వీనర్ మండికారి బాలాజీ మొక్కలు నాటారు. ఈ సందర్భంగా మండికారి బాలాజీ మాట్లాడుతూ భారత ప్రధాని నరేంద్రమోడీ నాయకత్వంలో భారత్ ఎంతో అభివృద్ధి చెందుతున్నదని లోక నాయకుడు నరేంద్రమోదీ ఎంతో సమన్వయంతో ప్రపంచ దేశాలతో సన్నిహితంగా ఉండటమే కాకుండా దేశ అభివృద్ధికి అహరహము శ్రమిస్తున్నారని బాలాజీ అన్నారు. పేద ప్రజల అభ్యున్నతి కోసం ఎంతగానో శ్రమిస్తు ఎన్నో అభివృద్ధి పనులు చేపడుతున్నారని అన్నారు. అందుకోసం ప్రతి ఒక్కరూ పార్టీ అభివృద్ధి కోసం కృషి చేయాలని కోరారు. కార్యక్రమంలో బిజెవైఎం అసెంబ్లీ కన్వీనర్ బొడ్డుపల్లి శ్రీనివాసులు, కిసాన్ మోర్చా జిల్లా ఉపాధ్యక్షులు నోముల చంద్ర గౌడ్, వెలిజాల చంద్రయ్య, అమ్రాబాద్ మండలం ప్రధాన కార్యదర్శిలు గాదె అశోక్, జబ్బు కృష్ణ, భోగరాజు, శంకర్, గోలి శివ, మహేష్ యాదవ్, జల్ల శివ, నాగరాజు యాదవ్, నోముల శ్రీనివాస్ గౌడ్, కంచర్ల శివ, కుమార్ గౌడ్, దాసరి అంజి, వెంకన్న, మొగిలి గణేష్, బచ్చయ్య ,నోముల శంకర్ గౌడ్, నల్లగంతుల రాఖి తదితరులు పాల్గొన్నారు.

## జిల్లా స్థాయి యువజనోత్సవాలు



**వారధి న్యూస్,నాగర్ కర్నూలు బ్యూరో:** జిల్లాస్థాయి యువజన సాంస్కృతిక పోటీలు మరియు సైన్స్ మేళా శనివారం సాయి గార్డెన్ ఫంక్షన్ హాల్, నాగర్ కర్నూల్ నందు ఉదయం 9 గం.లకు ప్రారంభించడం జరుగుతుందనియువజన సర్వీసు శాఖ, నాగర్ కర్నూల్ జిల్లా ఆధ్వర్యంలో జిల్లా స్థాయి యువజనోత్సవాలు ఈ నెల 28న ప్రారంభమవుతాయని ఆ శాఖ అధికారి వి. సీతారాం తెలిపారు. ఆయన ఆ మేరకు శుక్రవారం ఓ ప్రకటన విడుదల చేశారు.జిల్లా స్థాయి సాంస్కృతిక ఉత్సవాల క్రింద, అనేక అంశాలలో యువజనులకు పోటీలు నిర్వహించచున్నట్టు ఆయన వెల్లడించారు. నాగర్ కర్నూలు జిల్లాకు సంబంధించిన కళాకారులైన యువతి యువకులకు ఈ క్రింది అంశాలలో పోటీలలో పాల్గొన్నాల్సి ఉంటుందన్నారు. ఇందులో ముఖ్యంగా జానపద నృత్యం - సమూహం జానపద నృత్యం వ్యక్తిగత, జానపద పాట - సమూహం, జానపద పాట - వ్యక్తిగత, లైఫ్ స్కిల్స్, కాంపోనెంట్ కథా రచన, కవిత్వం, పేయింటింగ్, ప్రకృత పోటీలలో (నేపథ్య పోటీ) సైన్స్ అండ్ టెక్నాలజీలో ఆవిష్కరణ మరియు నందు హస్తకళ, టెక్స్ టైల్ మరియు వ్యవసాయ ఉత్పత్తుల నందు ప్రతీ అంశంలో విజేతలను నిర్ణయించి మొదటి స్థానం పొందిన వారిని రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపిక చేయటం జరుగుతుందన్నారు. ఈ పోటీలో పాల్గొనే యువ కళాకారులు నాగర్ కర్నూల్ జిల్లాకు చెందిన వారై ఉండాలన్నారు. అలాగే, ఈ జిల్లా స్థాయి పోటీలు సాయి గార్డెన్ ఫంక్షన్ హాల్, నాగర్ కర్నూల్ నందు జరుగుతాయన్నారు. పోటీలలో పాల్గొనే యువతీ యువకులు వయస్సు పోటీ నిర్వహించు నాటికి 15 సంవత్సరాల నుండి 29 సంవత్సరాల లోపు ఉండాలని, పోటీలో పాల్గొనే అంశానికి సంబంధించిన సామగ్రిని సంబంధిత యువ కళాకారులు తమ వెంట తెచ్చుకోవాలన్నారు. జానపద నృత్యము బృందంలో 10 మంది సభ్యుల బృందం 15 నిమిషాల గరష్ట కాలపరిమితి మించకుండా ప్రదర్శించాల్సి ఉంటుందన్నారు. సిడీలను, పెన్ డ్రైవ్లు గాని అనుమతించబడవు. జానపద పాటల బృందం 10 మంది కంటే ఎక్కువ ఉండరాదన్నారు. రికార్డు చేయబడిన సిడీలను, పెన్ డ్రైవ్లు గాని అనుమతించబడవని కూడా ఆయన పేర్గొన్నారు.

## మాదకద్రవ్యాల లేని సమాజాన్ని నిర్మించేందుకు కృషి చేయాలి

- **మాదకద్రవ్యాల నిరోధానికి కలిసికట్టుగా కృషి**
- **జిల్లా కలెక్టర్ బాదావత్ సంతోష్**



**వారధి న్యూస్,నాగర్ కర్నూలు బ్యూరో:**దేశభవిష్యత్తు యువతరంపైనే ఉందని వారు సక్రమ మార్గంలో పయనించి అనుకున్న లక్ష్యాలను చేరుకోవాలని దీనికి ఎలాంటి దురలవాట్లకు లోనుకాకుండా ఉండాలని జిల్లా కలెక్టర్ సూచించారు.శుక్రవారం నాగర్ కర్నూల్ కలెక్టరేట్ వీడియో కాన్ఫరెన్స్ సమావేశ మందిరంలో మాదకద్రవ్యాల నియంత్రణ కమిటీ సమావేశాన్ని కలెక్టర్ నిర్వహించారు.జిల్లాలో మాదక ద్రవ్యాల వినియోగం, రవాణా తదితర అంశాలపై జిల్లా ఎస్పీ గైక్వాడ్ వైభవ్ రఘునాథ్, కలిసి జిల్లా కలెక్టర్ అధికారులు తో కూలంకషంగా చర్చించారు. వాటి నియంత్రణకు తీసుకోవాల్సిన చర్యలపై కమిటీ సభ్యులు తమ అభిప్రాయాలను వెల్లడించారు.

ఈ సమావేశంలో కలెక్టర్ బాదావత్ సంతోష్, మాట్లాడుతూ ఒక్కసారి యువత మాదక ద్రవ్యాలకు అలవాటుపడిన తర్వాత జీవన శైలి మారిపోయి, వారు నిర్వర్తించాల్సిన బాధ్యతలను మర్చిపోతారని వివరించారు. ప్రస్తుతం సమాజాన్ని అల్కహాల్, గంజాయి, డ్రగ్స్ వంటి మత్తు పదార్థాలు పట్టి పీడిస్తున్నాయని వాటికి దూరంగా ఉండేలా యువత, పెద్దలు కృషి చేయాలన్నారు. మాదకద్రవ్యాలు తీసుకోవడం వల్ల నిజమైన ఆనందాన్ని కోల్పోవడం, వాటిని సంపాదించడం కోసం సమయాన్ని వినియోగించడం, కోపంగా, దురుసుగా ప్రవర్తించడం, వాటి ప్రభావంలో ప్రమాదాలకు గురి కావడం లాంటివి కూడా జరుగుతూ ఉంటుంది అన్నారు. విద్యార్థులు, యువత ఉన్నత లక్ష్యంతో వెళ్తున్న క్రమంలో ఏమాత్రం పెడదారిన వెళ్ళినా వారి జీవితాలకు ఇబ్బందులు తలెత్తే అవకాశం ఉందని దీనిని తల్లిదండ్రులు గుర్తించాల్సిందిగా కోరారు. మత్తు పదార్థాలకు ప్రతి ఒక్కరూ దూరంగా ఉన్నప్పుడే నవసమాజం నిర్మాణమవుతుందని అందుకు కృషి చేయాలని కోరారు. అలాగే జిల్లా వ్యాప్తంగా మాదకద్రవ్యాల వాడకం నియంత్రణకు యాక్షన్ ప్లాన్ రూపొందించాలని జిల్లా అధికారులకు కలెక్టర్ సూచించారు. జిల్లాలోని అన్ని ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలలు, కళాశాలల్లో వెంటనే యాంటీడ్రగ్ కమిటీలను ఏర్పాటు చేయాలని సూచించారు. జిల్లా కేంద్రంలో డిగ్రీ కళాశాలలో మాదకద్రవ్యాల నియంత్రణపై అవగాహన కార్యక్రమాన్ని ఏర్పాటు చేయాలని ఎస్పీకి సూచించారు. మత్తు పదార్థాల మీద ప్రజలకు అవగహన కార్యక్రమాలు విస్తృతముగా చేపట్టాలని అధికారులకు సూచించినారు జిల్లా ఎస్పీ గైక్వాడ్ వైభవ్ రఘునాథ్ మాట్లాడుతూ... జిల్లా పోలీస్ యంత్రాంగం మాదకద్రవ్యాల నియంత్రణపై పటిష్ట చర్యలు తీసుకున్నామని తెలిపారు. కొల్లాపూర్ లో పెద్ద అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించడం జరిగిందని తెలిపారు. జిల్లాలో గంజాయి రవాణాను గుర్తించి అధికారులు అందరూ కలిసికట్టుగా ముందుకు వెళ్తే పూర్తిస్థాయిలో గంజాయిని నియంత్రించవచ్చని తెలిపారు. జిల్లాలో డ్రగ్స్ వినియోగంలో లేవని, పోలీస్ శాఖ గంజాయి నియంత్రణకు పటిష్ట చర్యలు తీసుకున్నట్లు ఎస్పీ తెలిపారు. ఈ సమావేశంలో డిఎస్పి శ్రీనివాసులు, జిల్లా ఎక్సైజ్ అధికారిని గాయత్రి, జిల్లా ఇమ్యునైజేషన్ అధికారి రవి నాయక్, వైద్య ఆరోగ్యశాఖ అధికారులు పోలీసు అధికారులు తదితరులు పాల్గొన్నారు.



## క్రీడలలో గ్రామీణ విద్యార్థులు జాతీయ స్థాయికి ఎదగాలి

- **అచ్చంపేట ఎమ్మెల్యే డా.వంశీకృష్ణ**

**వారధి న్యూస్,నాగర్ కర్నూలు బ్యూరో:** గ్రామీణ ప్రాంత విద్యార్థులు క్రీడలలో ప్రతిభ కనపరిచి జాతీయస్థాయికి ఎదగాలని ఎమ్మెల్యే డాక్టర్ అన్నారు. పట్టణంలోని జడ్పిహెచ్ఎస్ బాలుల ఉన్నత పాఠశాలలో టోర్నమెంట్ , సెలక్షన్ కార్యక్రమంలో ఎమ్మెల్యే ముఖ్యఅతిథిగా పాల్గొని మాట్లాడారు. క్రీడలతోనే మానసిక సాగరకంగా ఉల్లాసంగా ఉంటారని ,ప్రభుత్వం క్రీడాభివృద్ధికి అధిక మొత్తంలో నిధులు కేటాయిస్తూ విద్యార్థులను క్రీడారంగంలో మరింత ఉన్నతంగా రాణించడానికి అన్ని రకాల వసతులు సదుపాయాలు కల్పిస్తుందన్నారు. సాయి నగర్ జెడ్పి ఉన్నత పాఠశాల కు అదనపు గదుల నిర్మాణం కొరకు 60 లక్షలు, అంబేద్కర్ నాలెడ్జ్ సెంటర్ నిర్మాణం కోసం 60 లక్షలు, రూపాయలు మంజూరు చేస్తూ జిల్లా కలెక్టర్ ప్రొసీడింగ్ ఇచ్చారని ఎమ్మెల్యే తెలిపారు. నిరుద్యోగ యువతీ యువకులు పోటీ పరీక్షలకు సిద్ధమవుతున్నటువంటి యువకులందరు .అంబేద్కర్ నాలెడ్జ్ సెంటర్ ను ఉపయోగించుకోవాలని ఎమ్మెల్యే సూచించారు.అచ్చంపేట నియోజకవర్గంలో ప్రతి మండలంలో రాజీవ్ గాంధీ మినీ స్టేడియాన్ని ఏర్పాటు చేయబోతున్నామని, పై లెట్ ప్రాజెక్టుగా మూడు మండలాలను ఎంపిక చేసామని తెలిపారు. పట్టణంలోని ఎన్టీఆర్ స్టేడియం ను రాజీవ్ గాంధీ స్టేడియంగా మారుస్తూ అన్ని రకాల వసతులతో ఏర్పాటు చేస్తామన్నారు.



## ఆచార్య కొండా లక్ష్మణ్ బాపూజీ ఆశయ సాధనకు మనమంతా కృషి చేయాలి

- **ఘనంగా కొండా లక్ష్మణ్ బాపూజీ 109వ జయంతి వేడుకలు.**
- **జిల్లా కలెక్టర్ బాదావత్ సంతోష్**

**వారధి న్యూస్, నాగర్ కర్నూలు బ్యూరో :**తెలంగాణా ఉద్యమనేత కొండా లక్ష్మణ్ బాపూజీ 109 వ జయంతి ని పురస్కరించుకొని శుక్రవారం నాగర్ కర్నూల్ జిల్లా కలెక్టరేట్ సమావేశమందిరములో అధికారికంగా ఏర్పాటు చేసిన కార్యక్రమంలో కలెక్టరేట్ అధికారులతో కలిసి ఆయన చిత్రపటానికి పూలమాలు వేసి ఘనంగా నివాళులర్పించారు.

ఈ సందర్భంగా మాట్లాడుతూ ఆచార్య కొండ లక్ష్మణ్ బాపూజీ ఆశయ సాధన కోసం కృషి చేయాలని కలెక్టర్ బాదావత్ సంతోష్ సూచించారు. స్వాతంత్ర పోరాటంలో నిజాం వ్యతిరేక ఉద్యమంలో ప్రత్యేక తెలంగాణ సాధన కోసం పోరాడిన తొలి తరం నాయకులలో కొండ లక్ష్మణ్ బాపూజీ ఒకరని, తెలంగాణ కోసం మంత్రి పదవిని త్యాగం చేసిన మహనీయుడని బడుగు బలహీన వర్గాల అభ్యున్నతి కొరకు పాటుపడిన వ్యక్తని, అతని అడుగుజాడల్లో నడుచుకోవడం మనందరికీ ఆదర్శప్రాయం అన్నారు. కొండా లక్ష్మణ్ బాపూజీ సేవలను గుర్తించిన తెలంగాణ ప్రభుత్వం అతని పేరు మీద కొండా లక్ష్మణ్ తెలంగాణ హార్టికల్చర్ యూనివర్సిటీ పేరును పెట్టుకోవడం జరిగిందని తెలిపారు. క్విట్ ఇండియా ఉద్యమంలో, స్వాతంత్ర్యోద్యమంలో, నిజాం నిరంకుశ వ్యతిరేక ఉద్యమంలో చురుకుగా పాల్గొన్న నిఖార్సైన తెలంగాణా వాది కొండా లక్ష్మణ్ అని అన్నారు. రాష్ట్ర ప్రభుత్వం అధికారికంగా జయంతి ఉత్సవాలను నిర్వహిస్తోందని కలెక్టర్ అన్నారు.ఈ కార్యక్రమంలో నాగర్ కర్నూల్ మున్సిపల్ చైర్మన్ కల్పన, జిల్లా వెనుకబడిన తరగతులు సంక్షేమ శాఖ అధికారి ఖాజా నాజీమ్ అలీ అప్సర్, పిడి డిఆర్డిఏ చిన్న ఓబులేసు, పద్మశాలి సంఘం నాయకులు జిల్లా అధ్యక్షుడు వెంకటస్వామి, సభ్యులు నిరంజన్, కుమారస్వామి, రామకృష్ణ, శేఖర్ గంగాధర్, పాలాది మహేష్ శ్రీనివాసులు, పాత్రికేయులు కందికొండ మోహన్, కలెక్టరేట్ సూపరిండెంట్లు చంద్రశేఖర్, యూసుఫ్ అలీ తదితరులు పాల్గొన్నారు.



## ఏఎంసీ చైర్మన్ భీమా సంతోష్ అధ్యక్షతన మొదటి పాలకవర్గ సమావేశం

**వారధి న్యూస్, జగిత్యాల:**గొల్లపల్లి వ్యవసాయ మార్కెట్ కమిటీ మొదటి పాలకవర్గ సమావేశం మార్కెట్ కార్యాలయంలో ఏఎంసీ చైర్మన్ భీమా సంతోష్ అధ్యక్షతన జరిగింది. తెలంగాణ ప్రభుత్వానికి మరియు ప్రభుత్వ విప్‌కు ధన్యవాదాలు తెలియజేశారు. రాబోయే సీజన్‌లో ధాన్యం కొనుగోలు సమయంలో రైతులు ఎలాంటి ఇబ్బందులు ఎదుర్కొనకుండా చూసేందుకు మార్కెట్ సిబ్బందికి తగిన సూచనలు చేశారు.ఈ సమావేశంలో వైస్ చైర్మన్ పురపాటి రాజి రెడ్డి, పాలకవర్గ సభ్యులు, గొల్లపల్లి గ్రామ పంచాయతీ ప్రత్యేక అధికారి సాయిబాబా, మార్కెట్ కార్యదర్శి ఫయిజోద్దిన్, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.




## భగత్ సింగ్ 117వ జయంతి గోడ పత్రిక ఆవిష్కరణ

**వారధి న్యూస్,నాగర్ కర్నూలు బ్యూరో:** సెప్టెంబర్ 28న భగత్ సింగ్ 117వ జయంతిని రాష్ట్ర ప్రభుత్వం అధికారికంగా నిర్వహించాలని అఖిల భారత యువజన సమాఖ్య (ఏ ఐ వై ఎఫ్) అధ్యక్ష కార్యదర్శులు దేశామోని ఆంజనేయులు బీజ్జ శ్రీనివాసులు డిమాండ్ చేశారు. ఏ ఐ వై ఎఫ్ నాగర్ కర్నూల్ జిల్లా సమితి ఆధ్వర్యంలో భగత్ సింగ్ 117వ జయంతి కి సంబంధించిన గోడ పత్రికను కామ్రేడ్ లక్ష్మణ చారి భవనంలోని శుక్రవారం ఆవిష్కరించారు. భగత్ సింగ్ కు పూల దండ కాదు భగత్ సింగ్ ను చదువుదాం అంటూ గోడపత్రిక రూపొందించామన్నారు. ఈ సందర్భంగా ఏ ఐ వై ఎఫ్ జిల్లా అధ్యక్షులు దేశామోని ఆంజనేయులు మాట్లాడుతూ భగత్ సింగ్ జీవితం భారత దేశ యువతకు స్పూర్తిదాయకమని, అటువంటి మహనీయుని త్యాగాలను నేటి సమాజానికి తెలపాల్సిన భాద్యత పాలకులదేనని వారు ఉద్ఘాటించారు. భగత్ సింగ్ జయంతిని ప్రభుత్వం అధికారికంగా నిర్వహించాలని వారు డిమాండ్ చేశారు. భగత్ సింగ్ జాతీయ ఉపాధి హామీ చట్టాన్ని రూపొందించాలని వారు డిమాండ్ చేశారు. ప్రజల ఐక్యతను చీల్చే మతోన్మాద రాజకీయాలు నేడు దేశంలో విచ్చలవిడిగా కొనసాగుతున్నాయని, స్వాతంత్ర్య ఉద్యమ కాలంలోనైనా నేటి కాలంలోనైనా అసలు సమస్యల నుంచి ప్రజల దృష్టి మరల్చి దోపిడీదారులకు ఉపకరించే, దేశ ద్రోహ కర్తవ్యాన్నే మతోన్మాద శక్తులు నెరవేరుస్తున్నాయని ధ్వజమెత్తారు. దేశ స్వాతంత్ర్య సముపార్జన ధ్యేయంగా ప్రాణాలను సైతం లెక్కచేయకుండా పోరాడిన భగత్ సింగ్ స్వాతంత్ర్య అనంతరం కుల, మతాలకు అతీతంగా ధనిక, పేద తారతమ్యాలు లేని, అవినీతి రహిత సమసమాజ స్థాపన కలలు కన్నాడన్నారు. మతోన్మాద ముక్త భారతం సాదించడానికి భగత్ ఆలోచనలు, ఆయన చూపిన కార్యాచరణ, మనకు తరగని స్ఫూర్తిగా నిలుస్తాయన్నారు. ఇనుప కండరాలు, ఉక్కునరాలు గల యువత దేశానికి అవసరం అని ప్రభోదించి సూక్తిగా నిలిచి "ఆత్మ విశ్వాసంకు మించిన ఆయుధం లేదని చాటి చెప్పిన భగత్ సింగ్ ప్రేరణతో, యువజనులతో మమేకమై ఉత్తేజ, ఉద్వేగభరితమైన ఉద్యమాలు సాగిస్తూ ఏ ఐ వై ఎఫ్ యూవజనుల గుండెల్లో నిలిచిందన్నారు. అదే విధంగా ఏ ఐ వై ఎఫ్ జిల్లా కార్యదర్శి బీజ్జ శ్రీనివాసులు మాట్లాడుతూ సామాజిక, న్యాయం, లౌకిక వాదన పరిరక్షణ, శాస్త్రీయ సోషలిజం, తీవ్రవాదానికి వ్యతిరేకంగా శాంతి స్థాపన కోసం, అశ్లీల సాహిత్యం, అశ్లీల సినిమాల నిషేధం కోసం దేశాన్ని చీల్చడానికి కుట్రలు చేసే వచ్చిన్నకర శక్తులకు వ్యతిరేకంగా, దేశ ఐక్యత, సమైక్యత కోసం ఆ ఐ వై ఎఫ్ కృషిచేస్తున్నదన్నారు. ఇంతటి పోరాట చరిత్ర కలిగిన ఏ ఐ వై ఎఫ్ ఆధ్వర్యంలో భగత్ సింగ్ 117వ జయంతి ని పురష్కరించు కొని జిల్లావ్యాప్తంగా క్రీడోత్సవాలు, వ్యాస రచన, చిత్రలేఖన పోటీలు, సదస్సులు, ర్యాలీలు వంటి కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు వారు తెలిపారు.ఈ కార్యక్రమంలో ఏ ఐ వై ఎఫ్ జిల్లా ఉపాధ్యక్షులు వాడల బాలపీరు, జిల్లా నాయకులు కపిలవాయి గోపి చారి, చిన్న పాక శ్రీనివాసులు తదితరులు పాల్గొన్నారు.



## సమాజంలో ప్రతి ఒక్కరు దైవచింతలలో పాలుపంచుకోవాలి

- **ఆర్. కృష్ణయ్య**

**వారధి న్యూస్, వికారాబాద్:** సమాజంలో ప్రతి ఒక్కరు దైవచింతలో పాలుపంచుకోవాలని, దేవుడు ఒక్కడే మరియు ఆయన లేనిదే సృష్టి లేదని జాతీయ బీసీ సంక్షేమ సంఘం అధ్యక్షుడు, రాజ్యసభ మాజీ సభ్యుడు ఆర్. కృష్ణయ్య పేర్కొన్నారు. శుక్రవారం వికారాబాద్ జిల్లా మోమిన్ పేట మండలం రాళ్ల గుడిపల్లి గ్రామంలో మెథడిస్ట్ చర్చి నిర్మాణ పనులను ఆయన ప్రారంభించారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, ప్రతి గ్రామంలో దేవాలయాలు నిర్మించుకోవాలనీ, భగవంతుని కొలిస్తే మనసు ప్రశాంతంగా ఉంటుందన్నారు. చర్చి నిర్మాణానికి ఆర్. కృష్ణయ్య మరియు ఆయన కుమార్తె డాక్టర్ శ్వేత కిషోర్ కుమార్ కలిసి రెండు లక్షల నగదు, మూడు లక్షల సామాగ్రిని అందజేశారు. గ్రామస్తులు ఈ సాయానికి ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో జాతీయ బీసీ విద్యార్థి సంఘం కోఆర్డినేటర్ డాక్టర్ అరుణ్ కుమార్, డి సి ఎం ఎస్ మాజీ చైర్మన్ బి. నర్సింలు గుప్తా, డిసిసిబి డైరెక్టర్ పట్లోళ్ల అంజిరెడ్డి, బీసీ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు చెరుకుల రాజేందర్, పాస్టర్లు, గ్రామ ప్రముఖులు తదితరులు పాల్గొన్నారు.




## ఘనంగా కొండా లక్ష్మణ్ బాపూజీ జయంతి వేడుకలు

**వారధి న్యూస్, నూతనకల్ :** స్వాతంత్ర్య సమరయోధుడు, ఆచార్య కొండా లక్ష్మణ్ బాపూజీ జయంతి వేడుకలను శుక్రవారం మండల పరిషత్ కార్యాలయం తహశిల్దార్ కార్యాలయంలో ఘనంగా నిర్వహించారు. కార్యక్రమంలో భాగంగా కొండా లక్ష్మణ్ బాపూజీ చిత్రపటానికి పుష్పాంజలి ఘటించారు. ఈ సందర్భంగా తహశిల్దార్ శ్రీనివాసరావు ఎంపీడీవో సునీత మాట్లాడుతూ తెలంగాణ కోసం సర్వస్వం ధారపోసిన త్యాగశీలి ఆచార్య కొండా లక్ష్మణ్ బాపూజీ అని కొనియాడారు.ఈ కార్యక్రమంలో డిటి వంశీరాజ్, ఆర్ఐ ప్రసాద్,ఎంపీఓ శశికళ, కార్యాలయ సిబ్బంది పాల్గొన్నారు.




## భువనగిరి ఖిల్లా వద్ద ఘనంగా యువజనోత్సవాలు, పర్యాటక దినోత్సవం

- **ఎమ్మెల్సీ తీన్మార్ మల్లన్న**

**వారధి న్యూస్, భువనగిరి:**భువనగిరి ఖిల్లా వద్ద గురువారం యువజన సర్వీసులు, క్రీడల శాఖ ఆధ్వర్యంలో జిల్లా స్థాయి సాంస్కృతిక యువజనోత్సవాలు మరియు ప్రపంచ పర్యాటక దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ముఖ్య అతిథిగా హాజరైన ఎమ్మెల్సీ తీన్మార్ మల్లన్న మాట్లాడుతూ, ఈ సారి స్వామి వివేకానంద జయంతిని పురస్కరించుకుని ఈ కార్యక్రమాలను జరుపుతున్నామని తెలిపారు. భువనగిరి ఖిల్లాను ప్రపంచ పర్యాటక కేంద్రంగా అభివృద్ధి చేయాల్సిన అవసరం ఎంతైనా ఉందని పేర్కొన్నారు. తాను భువనగిరి వాసినేనని, ఈ ప్రాంతంలోని శ్రీ లక్ష్మీనరసింహస్వామి డిగ్రీ కళాశాలలో విద్యాభ్యాసం చేశానని మల్లన్న గుర్తు చేశారు.ఈ కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ పోతం శెట్టి వెంకటేశ్వర్లు, అర్కియాలజీ ఏ.డి. నాగలక్ష్మి, యూత్ సంఘం ప్రెసిడెంట్ కరుణ్, హెరిటేజ్ కమిటీ సభ్యుడు వెంకటరెడ్డి తదితరులు పాల్గొన్నారు.జిల్లా యువజన మరియు క్రీడల అధికారి కె. ధనంజనేయులు మాట్లాడుతూ, స్వామి వివేకానంద భారతదేశం యొక్క ప్రాచీన సంస్కృతిని అమెరికా, ఇంగ్లాండ్‌లలో పరిచయం చేసి, యువతకు దిశానిర్దేశం చేశారని తెలిపారు. యువజన కళాకారులు అధిక సంఖ్యలో పాల్గొనడం ఎంతో ఆనందం కలిగించిందని, సైన్స్ మేళా విజయవంతంగా నిర్వహించామని అన్నారు.సుమారు 500 మంది ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు. 50 మంది విద్యార్థులు సైన్స్ మేళాలో పాల్గొని తమ ప్రతిభను ప్రదర్శించారు.



## రెండు బైకులు ఢీకొని ఇద్దరు మృతి

- **సంఘటన స్థలానికి చేరుకున్న పోలీసులు**

**వారధి న్యూస్ , చండూరు:** మునుగోడు చోల్లేడు ప్రధాన రహదారిలో ప్రమాదవశాత్తు రెండు బైకులు ఎదురెదురుగా ఇద్దరూ అక్కడికక్కడే మృతి చెందారు. వివరాల్లోకి వెళ్తే మునుగోడు గ్రామానికి చెందిన రేవెల్లి నాగరాజు(21) అనే వ్యక్తి చోల్లేడు గ్రామం నుండి బైక్ పై మునుగోడు వస్తుండగా మర్రిగూడ మండల పరిధిలోని నర్సిరెడ్డి గ్రామానికి చెందిన కీలకత్తుల ఆంజనేయులు (21), శివన్న గూడెం గ్రామానికి చెందిన బొమ్మగోని నగేష్ తో కలిసి మరో బైక్ పై మునుగోడు నుండి చోల్లేడు మీదుగా శివన్న గూడెం వెళుతున్నారు. మునుగోడు గ్రామ శివారులో వీరి రెండు బైకులు ఢీకోన్నాయి. దీంతో నాగరాజు,ఆంజనేయులుఅక్కడికక్కడే మృతి చెందారు. విషయం తెలుసుకున్నస్థానిక మునుగోడు ఎస్సై ఘటనా స్థలాన్ని పరిశీలించి తీవ్ర గాయాలైన నగేష్ ను నల్లగొండ ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. మృతుల కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

# గాలి మాటలతో గద్దెనెక్కిన కాంగ్రెస్



- **భీరం హర్షవర్ధన్ రెడ్డి**

**వారధి న్యూస్, హైదరాబాద్:** కాంగ్రెస్ ప్రభుత్వం ప్రజలను మాయమాటలతో మభ్యపెడుతోందని, ఎన్నికల సమయంలో గాలిమాటలు చెప్పి అధికారంలోకి వచ్చి, తర్వాత గాలిమోటార్ల యాత్రలు చేస్తూ ప్రజలను మోసం చేస్తున్నారని కొల్లాపూర్ నియోజకవర్గ మాజీ శాసనసభ్యులు భీరం హర్షవర్ధన్ రెడ్డి శుక్రవారం తెలంగాణ భవన్‌లో జరిగిన విలేకరుల సమావేశంలో మండిపడ్డారు.హర్షవర్ధన్ రెడ్డి మాట్లాడుతూ, గత ప్రభుత్వాలపై కాంగ్రెస్ నేత రేవంత్ రెడ్డి చేసిన ఆరోపణలు నెరవేరడం లేదని, ముఖ్యంగా శ్రీశైలం నిర్వాసితుల సమస్యలను ఈ ప్రభుత్వం పట్టించుకోలేదని విమర్శించారు. కేసీఆర్ ప్రభుత్వం 78 మందికి శాశ్వత ఉద్యోగాలు ఇచ్చి, శ్రీశైలం నిర్వాసితులకు ప్రాధాన్యత కల్పించేందుకు జీవో జారీ చేసిందని అన్నారు.పాలమూరు జిల్లాకు వచ్చిన మంత్రులు గాలి మాటలు చెప్పి వెళ్లిపోయారనీ, ప్రజలు నిజమైన పరిస్థితిని త్వరలోనే తెలుసుకుంటారని వ్యాఖ్యానించారు. రాష్ట్ర ప్రభుత్వ ఆస్పత్రుల పరిస్థితి అధ్వాన్నంగా మారిపోగా, ప్రజలు తిరుగుబాటుకు సిద్ధమవుతున్నారని హెచ్చరించారు.

ఈ సమావేశంలో మాజీ ఎమ్మెల్యేలు సురేందర్, నోముల భగత్, ఇతర కాంగ్రెస్ నాయకులు పాల్గొన్నారు.



## ఏసీబికి పట్టు బడ్డా ఇద్దరు అవినీతి అధికారులు..

**వారధి న్యూస్, జనగామ :** జనగామ జిల్లా కేంద్రంలో ని ఏకంగా కలెక్టరేట్ లో ఇద్దరు అవినీతి పరులు బయట పడ్డారు. ఆర్ అండ్ బి ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ సి హెచ్ హుస్సేన్ 12000,మరియు అసిస్టెంట్ టెక్నీకల్ ఆపిసర్ 2000. పెట్రోల్ పంపు పర్మిషన్ కోసం లంచం తీస్కుంటుండగా ఏసిబీ అధికారులు పట్టుకున్నారు ఇలా అవినీతి చేసే అధికారులు ఇంకా ఎంత మంది ఉన్నారోనని ఆరా తీస్తున్నారు...

## నేటి యువతరానికి మార్గదర్శకులు కొండ లక్ష్మణ్ బాపూజి

***వనపర్తి ఎమ్మెల్యే మెగా రెడ్డి**



**వారధి న్యూస్, వనపర్తి టౌన్:** నిరంకుశ నిజాం వ్యతిరేక, తెలంగాణ ఉద్యమ నాయకులలో ప్రముఖుడైన కొండా లక్ష్మణ్ బాపూజీ మనందరికీ, ముఖ్యంగా నేటి యువతరానికి మార్గదర్శకులని వనపర్తి ఎమ్మెల్యే మెగా రెడ్డి అన్నారు.శుక్రవారం ఆయన జయంతి సందర్భంగా బాపూజీ తెలంగాణ రాష్ట్ర సాధనలో చేసిన ఏనలేని కృషిని, పోరాటపటిమను స్మరించుకున్నారు.నిఖార్సయిన తెలంగాణ వాది అయినా బాపూజీ తెలంగాణ కోసం 1969లో మంత్రి పదవిని కూడా తృణప్రాయంగా వదిలిలేసిన నిబద్ధత కలిగిన రాజకీయవేత్త అని పేర్కొన్నారు. తెలంగాణ ఉద్యమాలలో చురుకైన పాత్ర పోషిస్తూనే రాష్ట్ర చేనేత సహకార రంగానికి కూడా కృషి చేసిన గొప్ప రాజకీయవేత్త కొండా లక్ష్మణ్ బాబూజీ అని ఆయన జ్ఞాపకం చేశారు.



## ఇంజనీరింగ్ కళాశాల బస్సులు ఢీ

**వారధి న్యూస్,మెదక్:** మెదక్ జిల్లా సర్సాపూర్ సమీపంలో జరిగిన ఘోర రోడ్డు ప్రమాదంలో ఒక బస్సు డ్రైవర్ మరణించాడు, మరియు 20 మందికి పైగా విద్యార్థులకు గాయాలు అయ్యాయి.నర్సాపూర్ సమీపంలోని ఎల్లమ్మ టెంపుల్ క్లాసిక్ గార్డెన్ వద్ద బీవీఐఆర్టీ కళాశాలకు చెందిన రెండు బస్సులు ఎదురెదురుగా ఢీకొన్నాయి. ఇవాళ తెల్లవారుజామున విద్యార్థులను పిక్అప్ చేసుకొని కళాశాలకు వెళ్తున్న క్రమంలో ఈ ప్రమాదం జరిగింది.ఈ ఘటనలో, డ్రైవర్లు నాగరాజు (50) మరియు మరో వ్యక్తి తీవ్రంగా గాయపడ్డారు. డ్రైవర్లు బస్సుల్లో ఇరుక్కుపోవడంతో, స్థానికులు వారిని బయటకు తీసేందుకు చాలాసేపు కష్టపడ్డారు.ప్రమాదంలో గాయపడిన విద్యార్థులను స్థానికులు సాయంగా, సంగారెడ్డి జిల్లా హాస్పిటల్‌కు తరలించారు. ఈ ప్రమాదం తర్వాత, నర్సాపూర్ సంగారెడ్డి మొయిన్ రోడ్డుపై భారీగా ట్రాఫిక్ జామ్ ఏర్పడింది.పోలీస్ ఈ ఘటనను పర్యవేక్షించి, కేసు నమోదు చేసి విచారిస్తున్నారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం సంగారెడ్డి హాస్పిటల్‌కు తరలించారు.



## బడుగు బలహీన వర్గాల స్ఫూర్తి ప్రదాత కొండా లక్ష్మణ్ బాపూజీ

**వారధి న్యూస్ మహబూబ్ నగర్,**
ఐ. సి. ఐ. సి. ఐ ఫౌండేషన్ ప్రతినిధి రవి కుమార్. బడుగు బలహీనవర్గాల స్ఫూర్తి ప్రదాత ప్రజాస్వామిక వాది మానవతావాది ఆచార్య కొండా లక్ష్మణ్ బాపూజీ గారు అని ఐ. సి. ఐ. సి. ఐ ఫౌండేషన్ ప్రతినిధి రవి కుమార్ అన్నారు శుక్రవారం రోజు ఆచార్య కొండా లక్ష్మణ్ బాపూజీ గారి 109వ జయంతి సందర్భంగా , హన్వాడ మండలం బుద్దారం గ్రామంలో పట్టణం లోని ఆచార్య కొండా లక్ష్మణ్ బాపూజీ చిత్రపటానికి పూలమాలలు వేసి ఘన నివాళులు అర్పించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ నిజమైన త్యాగానికి ఆయన నిలువెత్తు నిదర్శనం అని,1952 లో జరిగిన ముల్కి ఉద్యమం లో ఆయన కీలకపాత్రను పోషించారని అన్నారు. 1969 లో మంత్రి పదవిని త్యాగం చేశారని, అనంతరం తెలంగాణ సిద్ధించే వరకు ఎలాంటి అధికారిక పదవులు తీసుకోనని ఆయన నిర్ణయించుకున్నారని , 99 సంవత్సరాల వయస్సులో సైతం తెలంగాణలోని అన్ని వర్గాల ప్రజలను ఏకం చేసిన ఘనత వారిదని ఆయన స్పష్టం చేశారు. తెలంగాణ ఉద్యమం సందర్భంగా ఆచార్య కొండా లక్ష్మణ్ బాపూజీ గారి త్యాగాలు మరువ లేనివని కొనియాడారు ఈ కార్యక్రమంలో బుద్దారం మాజీ సర్పంచ్ మొద్దు చెన్నయ్య మరియు గ్రామ ప్రజలు పాల్గొన్నారు




## వనపర్తి జిల్లాలో పర్యాటక ప్రోత్సాహం

- **అదనపు కలెక్టర్ సంచిత్ గంగ్వార్**

**వారధి న్యూస్, వనపర్తి :** వనపర్తి జిల్లాలో పర్యాటక ప్రాంతాల ప్రమోషన్‌పై అదనపు కలెక్టర్ సంచిత్ గంగ్వార్ శుక్రవారం ఒక ముఖ్యమైన సందేశాన్ని ఇచ్చారు. ప్రపంచ పర్యాటక దినోత్సవాన్ని పురస్కరించుకొని, జిల్లా పర్యాటక అధికారి ఆధ్వర్యంలో కస్తూర్బా గాంధీ బాలికల విద్యాలయంలో జరిగిన కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు.ఈ సందర్భంగా, అదనపు కలెక్టర్ మాట్లాడుతూ, "వనపర్తి జిల్లాలో శ్రీరంగాపూర్, పామాపురం, చంద్రగడ్, పానగల్ కోట, ఖిల్లా ఘనపూర్ కోటలు వంటి ప్రత్యేకమైన పర్యాటక ప్రదేశాలు ఉన్నాయని, వాటిని సందర్శించడం ద్వారా ఆహ్లాదం, ఆరోగ్యం పొందవచ్చు" అన్నారు.విద్యార్థులకు వ్యాస రచన, వక్తృత్వ, చిత్రలేఖనం పోటీలు నిర్వహించి, మొదటి మూడు స్థానాల్లో నిలిచిన వారికి ప్రశంసా పత్రాలు మరియు బహుమతులు అందించారు.అదనపు కలెక్టర్ పర్యాటక ప్రదేశాలు ప్రాచుర్యం పొందడానికి సామాజిక మీడియా మరియు వ్యక్తిగత చర్చలు కీలకమని, "ప్రాంతం పరిశుభ్రంగా ఉండాలి; పరిశుభ్రత పర్యాటక రంగంతో నేరుగా సంబంధం కలిగి ఉంది" అని అన్నారు.ఈ కార్యక్రమానికి జిల్లా టూరిజం అధికారి పి. సీతారం, జిల్లా యువజన క్రీడల శాఖ అధికారి సుధీర్ రెడ్డి, కస్తూరిబా విద్యాలయ ఉపాధ్యాయులు, విద్యార్థులు తదితరులు హాజరయ్యారు.



## మంజూరైన రోడ్ల స్థాయి పై పంచాయతీరాజ్ అధికారులతో సమీక్ష

- **ఎమ్మెల్యే కోమటిరెడ్డి రాజ్ గోపాల్ రెడ్డి**

**వారధి న్యూస్, నాంపల్లి** మునుగోడు నియోజకవర్గంలో మునుగోడు, చండూరు, నాంపల్లి, మర్రి గూడెం, గట్టుప్పల్ మండలాలలో మంజూరైన 26 పంచాయతీ రాజ్ రోడ్ల పనులపై సమీక్ష నిర్వహించారు. ఈ సమీక్ష మునుగోడు లోని ఎమ్మెల్యే కోమటిరెడ్డి రాజ్ గోపాల్ రెడ్డి వారి వ్యక్తిగత క్యాంపు కార్యాలయంలో జరిగింది. ఈ సందర్భంగా, ఎమ్మెల్యే రాజ్ గోపాల్ రెడ్డి రోడ్డు పనుల ప్రగతి గురించి సమాచారాన్ని సేకరించారు. టెండర్ ప్రాసెస్ పూర్తయిన తర్వాత రోడ్డు పనులు మొదలయ్యాయా లేదా, సంబంధిత కాంట్రాక్టర్లు నిర్దేశించిన సమయంలో పనులను పూర్తి చేయడం కోసం అందరినీ ప్రోత్సహించారు.పంచాయతీ రాజ్ శాఖ మంత్రి సీతక్కతో మాట్లాడి, ఈ రోడ్లను మంజూరు చేయించడంలో తన పాత్రను వివరించారు. రోడ్ల నాణ్యత మరియు భద్రత విషయంలో రాజీ పడకుండా ఉండాలని అధికారులకు సూచించారు. అదే సమయంలో, ప్రమాదపు మూలమలుపులను తొలగించడం అవసరమని తెలిపారు. రోడ్డు నిర్మాణం పూర్తయిన తర్వాత, ఈ మార్గాలు అనేక కుటుంబాలకు సేవ చేస్తాయని, అందుకే భద్రతపై ప్రత్యేక దృష్టి పెట్టాలని అధికారులను కోరారు.



## శిథిలావస్థలో పెద్దమందడి బీసీ బాలుర వసతిగృహం

- **శివ నాయక్**



**వారధి న్యూస్, పెద్దమందడి:** పెద్దమందడి మండల కేంద్రంలోని బీసీ బాలుర వసతి గృహం అధికారుల నిర్లక్ష్యం వల్ల శిథిలావస్థకు చేరిందని రాష్ట్ర బంజారా గిరిజన విద్యార్థి సమాఖ్య అధ్యక్షులు శివ నాయక్ ఆరోపించారు. శుక్రవారం ఆయన వసతి గృహాన్ని సందర్శించి విద్యార్థులు ఎదుర్కొంటున్న పలు సమస్యలను పరిశీలించారు.వసతి గృహ భవనం శిథిలమై, పైకప్పు నుంచి సిమెంట్ పెచ్చులు ఊడిపోతున్నాయనీ, విద్యార్థులకు ఆహారం సరిగా అందడం లేదని శివ నాయక్ పేర్కొన్నారు. విద్యార్థులు ఎదుర్కొంటున్న సమస్యలను అధికారుల దృష్టికి ఎన్నిసార్లు తీసుకెళ్లినప్పటికీ, ఎలాంటి స్పందన లేదని ఆయన విమర్శించారు. అదనంగా, వసతిగృహానికి కాంపౌండ్ వాల్ లేకపోవడంతో భోజనం చేసే సమయంలో చుట్టుపక్కల పందులు తిరుగుతున్నాయని, దీనివల్ల విద్యార్థులు అసౌకర్యానికి గురవుతున్నారని తెలిపారు. జిల్లా కలెక్టర్ వెంటనే వసతిగృహాన్ని సందర్శించి సమస్యలను పరిష్కరించాలంటూ శివ నాయక్ డిమాండ్ చేశారు.



## 11వ రోజు స్వచ్ఛతా హి సేవ కార్యక్రమం

**వారధి న్యూస్, జడ్చర్ల:** స్వచ్ఛతా హి సేవ కార్యక్రమంలో భాగంగా, డా. బూర్గుల రామకృష్ణ రావు ప్రభుత్వ డిగ్రీ కళాశాల NSS యూనిట్ 3కు చెందిన 10 మంది వాలంటీర్లు, ప్రోగ్రాం ఆఫీసర్ డా. బి. సదాశివయ్య ఆధ్వర్యంలో, కొనేరు గ్రామాన్ని శుభ్రపరచడంలో మునుపటి రోజులే కాకుండా, శుక్రవారం కూడా భాగం తీసుకున్నారు.శివాలయం, ఆంజనేయస్వామి గుడుల మధ్య ఉన్న చెత్త, ముళ్ల కంపలు, పిచ్చి మొక్కలను తొలగించిన వాలంటీర్లు, 3 ట్రాక్టర్ ల చెత్త మరియు 100 కిలోలపైగా ప్లాస్టిక్ వ్యర్థాలను సేకరించారు.కోనేరు శుభ్రపరిచే కార్యక్రమంలో పాల్గొన్న NSS వాలంటీర్లను పెద్దగుట్ట రంగనాయకస్వామి పరిరక్షణ కమిటీ చైర్మన్ కాల్వ రామిరెడ్డి అభినందించారు. "జడ్చర్లలో ఉన్న ఈ కోనేరు సుమారు 1000 సంవత్సరాల చరిత్ర కలదు. దాన్ని కాపాడుకోవడం మన అందరి బాధ్యత" అని ఆయన అన్నారు.ప్రోగ్రాం ఆఫీసర్ డా. సదాశివయ్య మాట్లాడుతూ, "పరమ పవిత్రంగా భావించే పరిసరాలను అపవిత్రం చేస్తూ చెత్త వేయడం బాధాకరం" అని అన్నారు. స్వచ్ఛ భారత్ సాధనలో ప్రతి ఒక్కరి బాధ్యత ఉందని చెప్పారు.ఈ కార్యక్రమానికి మున్సిపల్ సిబ్బంది అశోక్ మరియు NSS వాలంటీర్‌లు రాహుల్, నవనీత్, సాయి, శంకర్, శివసాయి, శివ, హరికృష్ణ, సాయి కుమార్ పాల్గొన్నారు.ప్రిన్సిపాల్ డా. జి. సుకన్య కూడా ఈ గొప్ప కార్యానికి సంబంధించిన వాలంటీర్లను అభినందించారు.



## కొండా లక్ష్మణ్ బాపూజీకి ఘన నివాళి

**వారధి న్యూస్, వనపర్తి:** స్వాతంత్ర ఉద్యమ నేత మరియు తెలంగాణ ఉద్యమానికి ఆదిగురువు కొండా లక్ష్మణ్ బాపూజీ అని వనపర్తి జిల్లా బిఆర్ఎస్ అధ్యక్షులు గట్టు యాదవ్, అధికార ప్రతినిధి వాకిటి శ్రీధర్ పేర్కొన్నారు. శుక్రవారం, బాపూజీ 109వ జయంతి సందర్భంగా మాజీ మంత్రి నిరంజన్ రెడ్డి నివాసంలో బిఆర్ఎస్ పార్టీ ఆధ్వర్యంలో ఘనంగా నివాళులు అర్పించారు.ఈ సందర్భంగా, జిల్లా అధ్యక్షులు గట్టు యాదవ్ మాట్లాడుతూ, తెలంగాణ ఉద్యమానికి పునాది ఆచార్య కొండా లక్ష్మణ్ బాపూజీ అని, ఆయన తెలంగాణ కోసం పోరాటం చేసి, తెలంగాణ సాధన కాస్తా సాకారం కాకుండా మంత్రి పదవికి రాజీనామా చేసిన ధన్యజీవి అని కొనియాడారు. బాపూజీ తన జీవితాన్ని ప్రజా సంక్షేమం కోసం సమర్పించుకొని, సామాజిక వర్గాలను సమిష్టి ఉద్యమాల ద్వారా ఐక్యపరిచారని వారు తెలిపారు.ఈ కార్యక్రమంలో పి.రమేష్ గౌడ్, మార్క్ ఫెడ్ డైరెక్టర్ విజయ్ కుమార్, నందిమల్ల అశోక్, గంధంప రంజ్యోతి, జాతృనాయక్, కౌన్సిలర్లు నాగన్న యాదవ్, కంచె రవి, గులాం ఖాదర్ ఖాన్, నీల స్వామి, ప్రేమ్ నాథ్ రెడ్డి, మరియు పలువురు పాల్గొన్నారు.

## పర్యాటక రంగం పై అవగాహన ఉండాలి

- **జిల్లా కలెక్టర్ తేజస్ నందలాల్ పవార్**




**వారధి న్యూస్, సూర్యాపేట:** ప్రపంచ పర్యాటక దినోత్సవం సందర్భంగా జిల్లా కలెక్టర్ తేజస్ నంద్ లాల్ పవార్ మాట్లాడుతూ, విద్యార్థులకు పర్యాటక రంగం మరియు చరిత్రపై అవగాహన ఉండాలని సూచించారు. శుక్రవారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో మాట్లాడారు.కలెక్టర్ మాట్లాడుతూ, "సూర్యాపేట జిల్లాలో అద్భుతమైన చారిత్రక సంపద ఉందని, ప్రతి ఒక్కరు చరిత్ర మరియు సంస్కృతిని తెలుసుకోవాలని" అన్నారు. ఆయన విద్యార్థుల చరిత్రను మరువద్దని, గతంలో ఉన్న చరిత్రను మర్చిపోకుండా సంప్రదాయాన్ని, సంస్కృతిని కొనసాగించాలని కోరారు.ఈ కార్యక్రమంలో పిల్లల సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించబడ్డాయి, తదనుగుణంగా విద్యార్థులకు పర్యాటకంశాంతి అంశాలపై నిర్వహించిన వ్యాసరచన, వక్తృత్వం, డ్రాయింగ్ పోటీలలో గెలుపొందిన వారికి కలెక్టర్ సర్టిఫికెట్లు అందించారు.ఇందులో భాగంగా ఏర్పాటు చేసిన ఫుడ్ స్టాళ్లు రుచిగా, సూచిగా ఉన్నాయి.ఈ కార్యక్రమంలో డీఈఓ అశోక్ కుమార్, డిస్ట్రిక్ట్ టూరిజం ఆఫీసర్ ఏ రమేష్ కుమార్, డిఐఈఓ బాను నాయక్, మరియు ఇతర ప్రముఖులు పాల్గొన్నారు.



## మంచి చేయకపోయినా పర్వాలేదు చెడు చేయొద్దు

- **షాద్ నగర్ ఎమ్మెల్యే, రాష్ట్ర ప్రభుత్వ రంగ సంస్థల చైర్మన్ వీర్లపల్లి శంకర్**

**వారధి న్యూస్, షాద్ నగర్:** షాద్ నగర్ ఎమ్మెల్యే, రాష్ట్ర ప్రభుత్వ రంగ సంస్థల చైర్మన్ వీర్లపల్లి శంకర్ మాట్లాడుతూ, సమాజానికి ఎవరైనా మంచి చేయకపోయినా పర్వాలేదు కానీ చెడు చేయకూడదని అన్నారు. కొండ లక్ష్మణ్ బాపూజీ జయంతి వేడుకలు శుక్రవారం మండల పరిషత్ కార్యాలయం ఎదురుగా నిర్వహించబడ్డాయి. ఈ సందర్భంగా, నేటి సమాజంలో సంకుచిత మనస్తత్వాలు, స్వార్థాలు పెరిగినందు వల్ల ప్రజలు ఎలా జీవిస్తున్నారో తెలుసుకోవాలి అన్నారు. "రాజకీయాలు నేటి పరిస్థితుల్లో భ్రష్టు పట్టిపోయాయి, పాలకులు స్వార్థంతో ఆలోచించకుండా త్యాగంతో వ్యవహరిస్తే సమాజం మెరుగుపడుతుందని" పేర్కొన్నారు.మాజీ ఎమ్మెల్యే బక్కని నర్సింహులు, పద్మశాలీలు శ్రీ పద్మావతి అమ్మవారి ఆడపడుచులేనని తెలిపారు. కొండా లక్ష్మణ్ బాపూజీ చేసిన సేవలు రాష్ట్రానికి ఆదర్శమని చెప్పారు. బిజెపి రాష్ట్ర కార్యవర్గ సభ్యులు అందే బాబయ్య, పద్మశాలీలు రాజకీయ, ఆర్థిక, విద్యా రంగాల్లో రాణించాలని ఆకాంక్షించారు. ఈ వేడుకల్లో పద్మశాలి సంఘం చేనేత టవల్స్‌తో ప్రముఖులను సత్కరించారు.ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు, స్థానిక పద్మశాలి సంఘం నేతలు మరియు ఇతర సామాజిక కార్యకర్తలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

www.varadhinews.com
వారధి
తెలుగు దిన పత్రిక


# దాన్యం కొనుగోలు కేంద్ర ఏర్పాటులో సమస్యలు రానివ్వద్దని జిల్లా కలెక్టర్ ఆదేశాలు

**వారధి న్యూస్, సిద్దిపేట:** 202425 వానాకాలం ధాన్యం కొనుగోలు సంబంధిత సమావేశాన్ని జిల్లా కలెక్టర్ మను చౌదరి శుక్రవారం ఐడిఓసిలోని సమావేశ మందిరంలో నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, జిల్లా పరిధిలో నవంబర్ 2024 నుండి జనవరి 2025 నాటికి నాలుగు లక్షల మెట్రిక్ టన్నుల వరిధాన్యం పంట రానున్నట్లు తెలిపారు.ఈ పంటకు అనుగుణంగా 417 ధాన్యం కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేయడం, సమస్యలకు తావులేకుండా ముందుగానే ప్రణాళిక ప్రకారం పనులను చేపట్టాలన్నారు. ప్రభుత్వం ధాన్యం గ్రేడ్ఎ రకం ప్రతి క్వింటాలుకు 2320 రూపాయలు, ఇతర సాధారణ రకాలు 2300 రూపాయలకు నిర్ణయించిందని ఆయన వివరించారు.కొనుగోలు కేంద్రాల వద్ద టార్పాలిన్లు, మాయిశ్చర్ మిషన్‌లు, గన్నిసంచుల కొరత లేకుండా సమకూర్చుకోవాలని, అవసరమైనట్లైతే అదనంగా ఏర్పాటు చేసుకోవాలని సూచించారు. జిల్లా ప్రాధాన్యత క్రమంలో కొనుగోలు కేంద్రాలను గుర్తించి ఆటోమెటిక్ డ్రయ్యర్ మిషన్లు తెప్పించేందుకు ఏర్పాట్లు చేసుకోవాలని ఆయన ఆదేశించారు.అంతేకాక, 3641 మిల్లింగ్ కెపాసిటీ గల 148 రైస్ మిల్లులకు ధాన్యాన్ని తరలించడంలో ట్రాన్స్ పోర్ట్ సమస్యలు తలెత్తకుండా ముందుగానే చూసుకోవాలని ఆయన చెప్పారు. 2023 24 సీఎంఆర్ పై చర్యలు తీసుకోవాలని అధికారులను మను చౌదరి ఆదేశించారు.ఈ కార్యక్రమంలో అదనపు కలెక్టర్ (రెవెన్యూ) శ్రీనివాస్, డిఆర్డిఓ జయదేవ్ ఆర్యా, జిల్లా వ్యవసాయ అధికారి రాధిక, సివిల్ సప్లై అధికారి తనూజ, డిఎం సివిల్ సప్లై అధికారి ప్రవీణ్, పిడి మెప్మా హన్మంత్ రెడ్డి, రవాణాశాఖ అధికారి శంకర్ నారాయణ, ఇతర అధికారులు పాల్గొన్నారు.






## మణికొండలో ప్రపంచ పర్యాటక దినోత్సవం

**వారధి న్యూస్, రంగారెడ్డి:** మణికొండ మున్సిపాలిటీ కమీషనర్ ప్రదీప్‌కుమార్, ప్రజలు పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని సూచించారు. ప్రపంచ పర్యాటక దినోత్సవం సందర్భంగా, స్వచ్చత హీ సేవా కార్యక్రమం నిర్వహించబడింది. శుక్రవారం, 12వ వార్డులోని అనంత పద్మనాభ స్వామి గుట్ట ప్రాంతంలో ప్రత్యేక పారిశుధ్య కార్యక్రమం చేపట్టారు. ఈ కార్యక్రమంలో చెత్త, ప్లాస్టిక్ వంటి వ్యర్థాలను మరియు పిచ్చి మొక్కలను తొలగించడానికి పారిశుధ్య కార్మికులు శ్రమించారు. కార్యక్రమానికి కౌన్సిలర్లు శ్వేతాకిరణ్‌కుమార్, పురుషోత్తం, డిఈ దివ్యజ్యోతి, ఎన్విరాన్‌మెంట్ ఇంజనీర్ సంపత్, వార్డు అధికారి మల్లేష్, సూపర్‌వైజర్లు సాజిద్, లక్ష్మణ్ తదితరులు పాల్గొన్నారు. ఈ విధంగా, మణికొండలో పారిశుధ్యం నిర్వహించడంతో పాటు, పర్యాటకులు మరియు స్థానికుల కంటే సహాయంగా, ప్రజలకు శుభ్రత ప్రాధాన్యత గురించి అవగాహన పెంచడంలో ఈ కార్యక్రమం కీలకమైంది.



## ఓర్వలేని తనం వద్దు, రోగాలు వస్తాయ్..!

- టిడిపి పొలిట్ బ్యూరో సభ్యులు బక్కని నర్సింహులు

**వారధి న్యూస్, షాద్ నగర్:** సమాజంలో మనుష్యుల మధ్య ఓర్వలేని తనం ఉంటే ఒంటినిండా రోగాలే వస్తాయని టిడిపి పొలిట్ బ్యూరో సభ్యులు, షాద్ నగర్ మాజీ ఎమ్మెల్యే బక్కని నర్సింహులు అన్నారు. గురువారం కొండా లక్ష్మణ్ బాపూజీ జయంతి సందర్భంగా, స్థానిక ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ మరియు బిజెపి రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు అందే బాబయ్యలు హాజరైన కార్యక్రమంలో ఆయన ఈ వ్యాఖ్యలు చేశారు. మీడియాతో మాట్లాడిన నర్సింహులు, రాజకీయాలను పక్కన పెడితే సదుద్దేశంతో చేసే పనులను సమర్థించాలని, విమర్శలు అనవసరమని పేర్కొన్నారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి చెరువు కుంటలను నీటి రంగాలను కాపాడటానికి చేస్తున్న గొప్ప ప్రయత్నాన్ని అభినందించాలని సూచించారు. "రేపు భవిష్యత్తు తరాలను దృష్టిలో పెట్టుకొని సాగునీటి రంగాలను కాపాడేందుకు ప్రభుత్వం ప్రయత్నిస్తుండగా, కొంతమంది రాజకీయ కారణాల వల్ల విమర్శలు చేయడం అర్థం కావడం లేదు" అని ఆయన వ్యాఖ్యానించారు.తాను చిన్ననాటి నుండే చెరువులను కబ్జా కాకుండా కాపాడటానికి కృషి చేస్తున్నానని, ఇతరులు చేసే మంచి పనిని రాజకీయ విభేదాల ద్వారా అడ్డుకోవడం సరికాదని ఆయన స్పష్టం చేశారు.అదేవిధంగా, హైడ్రా పనులపై రాజకీయ ఆరోపణలు చేయడం సమాజానికి మంచిది కాదని, ఈ పనులు మంచి ఫలితాలను అందిస్తాయని నర్సింహులు తెలిపారు.



## మహాలక్ష్మి పథకం: 500కే గ్యాస్ సిలిండర్ ప్రొసీడింగ్ పర్వేద గ్రామస్తులకు అందజేత

**వారధి న్యూస్, శంకర్ పల్లి:** మహాలక్ష్మి పథకంలో భాగంగా శుక్రవారం 500 కే గ్యాస్ సిలిండర్‌ను పర్వేద గ్రామస్తులకు అందించిన కార్యక్రమాన్ని మాజీ సర్పంచ్ అనిత సురేందర్ గౌడ్ నిర్వహించారు. తెలంగాణ ప్రభుత్వం ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీ ప్రకారం, ఆరు గారెంటీలలో భాగంగా ఒక్కొక్క గారెంటీని అమలు చేయడంలో భాగంగా ఈ కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా, పర్వేద మాజీ సర్పంచ్ అనిత మాట్లాడుతూ, "ఈ పథకాలు ప్రజలకు అందించడంతో, ప్రభుత్వ నిధులు నేరుగా వారి గృహాల్లోకి చేరుకుంటున్నాయి" అన్నారు.ఈ కార్యక్రమంలో వార్డు సభ్యులు, గ్రామ ప్రజలు, మరియు కాంగ్రెస్ నాయకులు పాల్గొన్నారు, ఇది గ్రామ అభివృద్ధికి, మహిళా శక్తికారణానికి దోహదం చేస్తుందని ఆమె తెలిపారు.



## తెలంగాణ పోలీస్ అకాడామీలో కొండా లక్ష్మణ్ బాపూజీ జయంతి వేడుకలు

**వారధి న్యూస్, గండిపేట్:** తెలంగాణ రాష్ట్ర పోలీస్ అకాడామీలో శుక్రవారం కొండా లక్ష్మణ్ బాపూజీ జయంతి వేడుకలు ఘనంగా నిర్వహించబడ్డాయి. అకాడామీలోని సెమినార్ హాల్‌లో బాపూజీ చిత్రపటానికి పూలమాలలు వేసి ఆయనకు నివాళులు అర్పించారు.ఈ సందర్భంగా జాయింట్ డైరెక్టర్ టి. మురళీధర్ ముఖ్య అతిథిగా పాల్గొని, కొండా లక్ష్మణ్ బాపూజీ సేవలను గుర్తు చేసుకున్నారు. "దేశ స్వాతంత్రోద్యమంలో తెలంగాణ తొలి మలి దశ ఉద్యమాలు ఆయన చేసిన పోరాటం నాటి తరాన్ని ఎంతో ప్రభావితం చేసింది," అని ఆయన అన్నారు.ఈ కార్యక్రమానికి డిప్యూటీ డైరెక్టర్లు వెంకటేశ్వర్లు, నర్మద, సునీతామోహన్, అసిస్టెంట్ డైరెక్టర్లు, డిఎస్పిలు, మరియు ఇతర అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.



## అగ్నిమాపక సిబ్బంది సేవలు ఎంతో గొప్పవి

- ఎమ్మెల్యే ప్రకాష్ గౌడ్

**వారధి న్యూస్, రంగారెడ్డి:** రాజేంద్రనగర్ నియోజకవర్గ ఎమ్మెల్యే టి. ప్రకాష్‌గౌడ్ అగ్నిమాపక సిబ్బంది చేస్తున్న సేవలను ప్రశంసించారు. శుక్రవారం, రాజేంద్రనగర్‌లోని అగ్నిమాపక కేంద్రంలో నూతనంగా మంజూరైన రెండు అగ్నిమాపక వాహనాలను ఆయన చేతుల మీదుగా ప్రారంభించారు.ఈ కార్యక్రమంలో అగ్నిమాపక సేవల శాఖ పోలీసులు, సిబ్బంది, నాయకులు మరియు ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు. ఎల్లప్పుడూ ప్రజల సమక్షంలో ఉండే అగ్నిమాపక సిబ్బంది, ప్రజల రక్షణకు అంకితమై పనిచేస్తున్నారని ఎమ్మెల్యే పేర్కొన్నారు.




## పిట్లంలో విద్యార్థుల కోసం ప్రత్యేక శిక్షణ కార్యక్రమం

**వారధి న్యూస్, పిట్లం:** కామారెడ్డి జిల్లా పిట్లంలో లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో గురువారం, శుక్రవారం రెండు రోజులపాటు కౌమార దశలో విద్యార్థులకు ప్రత్యేక శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. బ్లూ బెల్స్ పాఠశాలలో జరిగిన ఈ కార్యక్రమంలో, విద్యార్థులు ఎదుర్కొనే సవాళ్లను ఎలా ఎదుర్కోవాలో, ఒత్తిడితో కూడిన పరిస్థితులను అధిగమించడానికి అవసరమైన నైపుణ్యాలను అభివృద్ధి చేయడం, భావోద్వేగాలను గుర్తించడం మరియు నియంత్రించడం ద్వారా ప్రమాదకర ప్రవర్తనలకు ప్రతిఘటనను బలోపేతం చేయడం వంటి అంశాలపై శిక్షకురాలు డాక్టర్ లక్ష్మి మూర్తి 36 మంది ఉపాధ్యాయులకు శిక్షణ ఇచ్చారు .ఈ కార్యక్రమంలో జిల్లా కో ఆర్డినేటర్ నారాయణ, డిస్ట్రిక్ట్ గవర్నర్ అమర్నాథ్ రావ్, పిట్లం మండల విద్యాధికారి దేవీసింగ్, పిట్లం లయన్స్ క్లబ్ అధ్యక్షులు కాశిరెడ్డి, జోన్ చైర్మన్ కిషన్, కార్యదర్శి వేణుగోపాల్, కోశాధికారి బాలు, సభ్యులు బెజగం శేఖర్ మరియు ఇతరులు పాల్గొన్నారు.



## హైడ్రా పై అల్వాల్ లో ఎం పి ఈటెల కీలక వ్యాఖ్యలు

- కెసిఆర్ ప్రభుత్వ పనితీరు తెలుసుకోవడానికి ఆరేళ్ల సమయం పటింది
- రేవంత్ రెడ్డి పాలన తెలుసుకోవడానికి కేవలం ఆరు నెలల్లోనే తెలిసిపోయింది


**వారధి న్యూస్, హైదరాబాద్ :** హైడ్రా పేరుతో ప్రభుత్వం హై డ్రామా చేస్తుందని ఈటెల అన్నారు. ఉద్యోగులకు జీతాలు ఇవ్వకుండా లక్షల కోట్లు పెట్టి మూసి సుందరీకరణ చేస్తానంటూ , స్థానికుల గూడు చెదరగొట్టే కార్యక్రమం ప్రభుత్వం చేస్తుందని మండిపడ్డారు. అల్వాల్ జొన్న బండలో ఏడు దశాబ్దకాలాల నుండి , ఉన్న వడ్డెర వర్గానికి చెందిన వారికి నోటీసులు ఇచ్చి ప్రభుత్వం భయభ్రాంతులకు గురిచేస్తుందని, ఈ నోటీసులకు ఎవరు భయపడవలసిన అవసరం లేదని తాను అండగా ఉంటానని అక్కడ ఉన్న వారికి హామీ ఇచ్చారు. శని ఆదివారాలు సెలవు దినాలు చూసుకుని నిజాం సర్కార్ కంటే దుర్మార్గంగా కూల్చివేతలు నిర్వహిస్తున్నారని ఆవేదన వ్యక్తం చేసినఎం పి ఈటెల రాజేందర్ . కాంగ్రెస్ ప్రభుత్వం అంటే పేదల కోసమే ఉంటది, ఇందిరమ్మ ఇల్లు కట్టించమనే చెప్పుకునే కాంగ్రెస్ పార్టీ , పేదాలు కట్టుకున్న ఇళ్లకు ఎం ఆర్ ఓ లతో నోటీసులు ఇప్పించడం బాధాకరమని తెలిపారు . ప్రజల కు బిజెపి పార్టీ అండగా ఉంటుందని ఎంపీ ఈటెల రాజేందర్ హైదరాబాద్ ప్రజలకు హామీ ఇచ్చారు.




## డ్రగ్స్ మహమ్మరితో జీవితాలు నాశనం చేసుకోవద్దు

- గాంధీ సూపరింటెండెంట్ రాజకుమారి

**వారధి న్యూస్, హైదరాబాద్ :** డ్రగ్స్ అనే మహమ్మారికి నేటి యువత దూరంగా ఉండాలని, డ్రగ్స్ కు బాని సై తమ విలువైన జీవితాలకు నాశనం చేసుకోవడని గాంధీ ఆసుపత్రి సూపర్డెంట్ డా. రాజకుమారి అన్నారు. షోలోమ్ అఫ్ హోఫ్ ఫౌండేషన్ ఫౌండేషన్ రూపొందించిన డ్రగ్స్ నిర్మూలన అవేర్నెస్ పోస్టర్ ను శుక్రవారం ఆమె గాంధీ హాస్పిటల్ లో ఆవిష్కరించారు. డ్రగ్స్ మామారికి దూరంగా ఉండి తల్లిదండ్రుల ఆశయాల సాధనకు నేటి యువత కృషి చేయాలని ఆమె పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో ఆర్ ఎం ఓ 1 డా. శేషాద్రి,అశోక్ రాజేందర్ పాల్గొన్నారు.



## చేర్యాల పట్టణంలో కళ్యాణ లక్ష్మి చెక్కుల పంపిణీ

**వారధి న్యూస్, సిద్ధిపేట:** పేదల సంక్షేమమే ప్రభుత్వ లక్ష్యమని రాష్ట్ర దేవదాయ శాఖ మంత్రి కొండా సురేఖ అన్నారు. శుక్రవారం, చేర్యాల పట్టణంలోని శ్రీ రేణుక గార్డెన్స్‌లో జరిగిన కార్యక్రమంలో, జనగామ శాసనసభ నియోజకవర్గంలో 242 మంది లబ్ధిదారులకు కళ్యాణ లక్ష్మి, షాది ముబారక్ చెక్కులను స్థానిక శాసనసభ్యుడు పల్లా రాజేశ్వర్ రెడ్డి తో కలిసి మంత్రి అందజేశారు. ఈ సందర్భంగా, కొండా లక్ష్మణ్ బాపూజీ జయంతి సందర్భంగా ఆయన చిత్రపటానికి పూలమాలవేసి నివాళులర్పించారు. అనంతరం 2 కోట్ల 48 లక్షల రూపాయల విలువైన చెక్కులను పంపిణీ చేస్తూ, ఈ ప్రభుత్వం పేదల ప్రభుత్వమని, ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నేతృత్వంలో పేద ప్రజల సంక్షేమం కోసం కృషి చేస్తామని అన్నారు.మంత్రివర్యులు, ప్రజలకు మేలు కలిగించే పథకాల గురించి మాట్లాడుతూ, గత ప్రభుత్వాలు ప్రవేశపెట్టిన పథకాలను కొనసాగించడం తగినదని, రాష్ట్ర ఆర్థిక పరిస్థితిని మెరుగుపరిచే దిశగా చర్యలు తీసుకుంటున్నారని చెప్పారు. 200 రూపాయల వరకు ఉచిత విద్యుత్తు, 500 రూపాయలకే సబ్సిడీ సిలిండర్ వంటి పథకాల అమలుకు ప్రభుత్వాలు కోటలు ఖర్చు చేస్తున్నాయని పేర్కొన్నారు.చేర్యాలలో అర్హులైన జర్నలిస్టులకు డబుల్ బెడ్ రూమ్ ఇండ్లను మంజూరు చేస్తామని మంత్రి ఫోన్ ద్వారా డిపిఆర్ఓకు తెలిపారు. ఈ కార్యక్రమంలో జిల్లా అదనపు కలెక్టర్ రెవెన్యూ శ్రీనివాస్ రెడ్డి, సిద్దిపేట ఆర్డీవో సదానందం, స్థానిక మున్సిపల్ చైర్ పర్సన్, ఇతర అధికారులు పాల్గొన్నారు.




## మూసి జల కాలుష్యంపై సిపిఎం సభ్యుల ఆందోళన

**వారధి న్యూస్, భూదాన్ పోచంపల్లి:** మూసి నీటి శుద్ధి కోసం అన్ని ప్రాంతాలలో యంత్రాంగాలను ఏర్పాటు చేసి, మూసి జల కాలుష్యాన్ని నివారించాలని సిపిఎం రాష్ట్ర కమిటీ సభ్యులు కొండమడుగు నరసింహ అన్నారు. శుక్రవారం, భూదాన్ పోచంపల్లి మండల పరిధిలోని కనుముకుల గ్రామంలో సిపిఎం 13వ శాఖ మహాసభలో, బోయపల్లి పురుషోత్తం రెడ్డి అధ్యక్షతన ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడారు.నరసింహ మాట్లాడుతూ, "మూసి పరివాహక ప్రాంతం అయిన పోచంపల్లి జల కాలుష్యంతో ప్రజలు, పశుపక్ష్యాదులకు ప్రమాదం ఏర్పడుతున్నా, పాలకులకు బాధ్యత లేదని" మండిపడ్డారు. మూసి కాలుష్యంతో పాటు వాయు కాలుష్యంతో నీరు, భూమి, గాలి కాలుష్యంగా మారి క్యాన్సర్, కిడ్నీ సమస్యల బారిన పడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఇప్పటికైనా రాష్ట్ర ప్రభుత్వం స్పందించి, జల కాలుష్యాన్ని నివారించి ప్రత్యామ్నాయంగా గోదావరి జలాలను అందించాలని డిమాండ్ చేశారు.ఈ కార్యక్రమంలో సిపిఎం మండల కార్యదర్శి వర్గ సభ్యులు కోట రామచంద్రారెడ్డి, మంచాల మధు, ప్రసాదం విష్ణు, నిలకంటి జంగయ్య, జంగారెడ్డి, కుంభం జనార్ధన్, నిర్మల, కోట పాండురంగారెడ్డి, బుచ్చిరెడ్డి, అచ్చయ్య, భూపాల్ రెడ్డి, నర్సిరెడ్డి, సత్తిరెడ్డి, గోపాల్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.



## ప్రగతిశీల ప్రజాస్వామ్య విద్యార్థి సంఘం అర్ధ శతాబ్ది ఉత్సవాలు

**వారధి న్యూస్, నూతనకల్:** ప్రగతిశీల ప్రజాస్వామ్య విద్యార్థి సంఘం (PDSU) అర్థ శతాబ్ది ఉత్సవాలు ఈనెల 30న తిరుమలగిరిలో జరిగే డివిజన్ సభను విజయవంతం చేయాలని PDSU డివిజన్ కార్యదర్శి పిడమర్తి భరత్ కోరారు. శుక్రవారం, నూతనకల్ మండల కేంద్రంలో కరపత్రాలను ఆవిష్కరణ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, "PDSU విద్యార్థి సంఘం గత 50 సంవత్సరాలుగా విద్యార్థుల సమస్యల కోసం నిరంతరం పోరాడుతుంది" అని చెప్పారు. కామన్ స్కూల్ విద్యా విధానం, శాస్త్రీయ విద్యా విధానం, ప్రైవేటు కార్పొరేట్ విద్యాసంస్థల దోపిడి పై మరియు మతోన్మాదానికి వ్యతిరేకంగా పోరాడుతూ, కామ్రేడ్ జార్జి రెడ్డి, జంపాల చంద్రశేఖర్ ప్రసాద్, కోలా శంకర్, యనాల వీరారెడ్డి, మారోజు వీరన్న, రంగవల్లి వంటి అనేక విద్యార్థి రత్నాలను PDSU కోల్పోయిందని పేర్కొన్నారు.సంఘానికి 50వసంతాలు నిండిన సందర్భంగా అక్టోబర్ 24వ తేదీన తెలంగాణ మరియు ఆంధ్ర ప్రదేశ్ రాష్ట్ర కమిటీల ఆధ్వర్యంలో ఉస్మానియా యూనివర్సిటీ ఠాగూర్ ఆడిటోరియంలో జరగబోయే సభను విజయవంతం చేయడానికి వేలాదిమంది విద్యార్థులు తరలి రావాలని పిలుపునిచ్చారు.ఈ ఆవిష్కరణలో PDSU నాయకులు అనిల్, శివ, సాయి, మని, రమేష్, రాజ్ తదితరులు పాల్గొన్నారు.

వారధి
తెలుగు దిన పత్రిక
www.varadhinews.com



# నెపో కిడ్స్‌ని రేసులో వెనక్కి నెట్టిన బ్యూటీ



బాలీవుడ్‌లో పాపులర్ కథానాయికలతో పోటీపడుతూ రేసులో నిలదొక్కుకోవాలంటే నేటితరం కథానాయికలు ఎలాంటి ప్రణాళికలతో ఉండాలి?.. దీనికి పక్కా సమాధానం జాన్వీకపూర్ ప్లానింగ్. సాటి నెపో కిడ్స్ అయిన సారా అలీఖాన్, అనన్య పాండే కంటే జాన్వీ తెలివిగా పావులు కదుపుతోంది. ఓవైపు బాలీవుడ్‌లో నటిస్తూనే, మరోవైపు సౌత్‌లో అగ్ర హీరోల సరసన అవకాశాలు అందుకుంటోంది. నటన పరంగా, డ్యాన్సుల పరంగా జాన్వీ కపూర్ తనదైన ముద్ర వేస్తోంది. బహుశా శ్రీదేవి నటవారసురాలిగా ఈ బ్యూటీకి ఉన్న క్రేజ్ కూడా అదనంగా సహకరిస్తోంది. అయితే నటవారసులు కానివాళ్లు ఇలాంటి చోట నిలదొక్కుకునేదెలా? అంటే... ఇప్పుడు అందరి కళ్లకు కనిపిస్తున్న బ్యూటీ ట్రిప్తి దిమ్రీ. ఈ భామ ఔట్ సైడర్‌గా బాలీవుడ్‌లో ప్రవేశించినా కానీ వేగంగా ఎదిగేస్తోంది. ఇటీవల వరుసగా క్రేజీ సీక్వెల్ సినిమాల్లో నటిస్తూ బిజీ బిజీగా ఉంది. ఓవైపు బోల్డ్ పాత్రల్లో నటిస్తూ కావాల్సిన విజయాలను ఖాతాలో వేసుకున్న ట్రిప్తి ఇటీవల యూత్‌ని ఆకర్షించే మరిన్ని చిత్రాల్లో నటిస్తూ బిజీగా ఉంది. నేటితరంలో అత్యంత బిజీయెస్ట్ కథానాయికగా ట్రిప్తి దూసుకెళుతోంది. అంతేకాదు ఇతర భామలతో పోలిస్తే పారితోషికాన్ని కూడా అమాంతం పెంచేసింది ఈ బ్యూటీ. ఇటీవల చాలామంది అగ్ర కథానాయికలు వరుసగా పెళ్లిళ్లతో సెటిలైపోవడం కూడా ఈతరం భామలకు కలిసొస్తోంది. ఇప్పుడు అలాంటి అవకాశాన్ని సద్వినియోగం చేసుకుంటూ ట్రిప్తీ మరింతగా బిజీ అయిపోతోంది. జాన్వీ, సారా, అనన్య, కియరా లాంటి నేటితరం కాంపిటీటర్స్ తో పోలిస్తే తన ఎంపికలు చాలా డిఫరెంట్ అని కూడా నిరూపిస్తోంది. ఆ ముగ్గురు భామలతో పోలిస్తే ట్రిప్తీ దిమ్రీ డిఫరెంట్ జానర్ లను టచ్ చేస్తోంది. రష్మిక మందన్న లాంటి సౌత్ బ్యూటీ పోటీబరిలో ఉన్నా కానీ, ట్రిప్తీ దిమ్రీకి అది అడ్డంకి కాదు అనడంలో సందేహం లేదు. ఇక ఇమేజ్ సమస్య లేకపోవడం కూడా తనకు పెద్ద ప్లస్ అవుతోంది. చాలామందితో పోలిస్తే సాంప్రదాయక పాత్రల్లో కాకుండా పూర్తిగా బోల్డ్ టచ్ ఉన్న పాత్రలను ట్రిప్తి ఎంపిక చేసుకోవడం ప్లస్ గా మారుతోంది.



# నిర్మాతలకు కమిట్ మెంట్

శృతి హరిహరన్ గుర్తుందా.. గతంలో సీనియర్ నటుడు అర్జున్ పై మీటూ వ్యాఖ్యలు చేసింది ఈమెనే. ఓ సినిమా షూటింగ్ లో తనను గట్టిగా కౌగిలిగించుకున్నాడని, సీన్ పండడం కోసం అలా చేశానంటూ బుకాయించాడంటూ ఆమె స్టేట్ మెంట్ ఇచ్చిన సంగతి తెలిసిందే. ఆ తర్వాత ఆ కేసు కోర్టుకెళ్లింది. సరైన సాక్ష్యాధారాలు లేవంటూ కోర్టు కేసు కొట్టేసింది. ఇప్పుడీమె మరోసారి తెరపైకొచ్చింది. కేరళలో సంచలనం సృష్టిస్తున్న హేమ కమిటీకి ఈమె ఇచ్చిన స్టేట్ మెంట్ ఇప్పడు వైరల్ గా మారింది. కెరీర్ లో స్టార్టింగ్ లో ఓ తమిళ సినిమా కోసం ఐదుగురు నిర్మాతలు ఆమెను కమిట్ మెంట్ అడిగారంట. ఈమె నటించిన ఓ కన్నడ సినిమా రీమేక్ రైట్స్ తీసుకున్నారట. తమిళ్ రీమేక్ లో శృతినే తీసుకోవాలనుకున్నారట. అలా హీరోయిన్ గా అవకాశం ఇవ్వాలంటే తమకు పడక సుఖం అందించాలని అడిగారట. ఆ సినిమాకు ఐదుగురు నిర్మాతలు కాబట్టి, ఐదుగుర్నీ సుఖపెట్టాలని కండిషన్ పెట్టారట. దీంతో ఆ తమిళ రీమేక్ నుంచి తాను బయటకొచ్చేశానని శృతి హరిహరన్, హేమ కమిటీకి వెల్లడించింది.

# మృణాల్‌కి అంత చెల్లించాల్సిందే



'సీతారామం' సినిమాతో టాలీవుడ్ లోకి అడుగుపెట్టిన అందాల భామ మృణాల్ ఠాకూర్. ఈ సినిమా ఆమెకి తెలుగులోనే కాకుండా హిందీలో కూడా స్టార్ హీరోయిన్ ఇమేజ్ తీసుకొచ్చింది. బ్యాక్ టూ బ్యాక్ సినిమా అవకాశాలు తెచ్చిపెట్టింది. ఇక 'సీతారామం' తర్వాత 'హాయ్ నాన్న' సినిమాతో తెలుగులో మృణాల్ మరో సక్సెస్ ని సొంతం చేసుకుంది. ఈ ఏడాది 'ది ఫ్యామిలీ స్టార్' మూవీలో విజయ్ దేవరకొండకి జోడీగా నటించింది. ఈ మూవీ డిజాస్టర్ అయ్యింది. ప్రస్తుతం తెలుగులో కొన్ని సినిమాల కోసం మృణాల్ ఠాకూర్ ని సంప్రదిస్తున్నారని తెలుస్తోంది. మరో వైపు హిందీలో కూడా ఆమె చేతిలో చాలా ప్రాజెక్ట్స్ ఉన్నాయి. ఇదిలా ఉంటే మృణాల్ ఠాకూర్ కి వచ్చిన ఫేమ్ తో ఆమె కమర్షియల్ గా ఉపయోగించుకునే పనిలో ఉన్నారు. చాలా చోట్ల జ్యువెలరీ, వస్త్ర దుకాణాలు ప్రారంభోత్సవానికి సెలబ్రెటీలని ఇన్వైట్ చేస్తూ ఉంటారు. తెలుగులో వర్ధమాన తారల నుంచి స్టార్ హీరోయిన్స్ వరకు అందరూ షోరూమ్ ల ప్రారంభోత్సవానికి వెళ్తూ ఉంటారు. ఇప్పుడు మృణాల్ ఠాకూర్ ని కూడా ఇలాంటి షోరూమ్ ల ఓపెనింగ్ కోసం సంప్రదిస్తున్నారంట. అలాగే వస్త్ర దుకాణాల అడ్వార్టైజ్మెంట్స్ కోసం కూడా అగ్రిమెంట్స్ చేసుకుంటున్నట్లు టాక్ వినిపిస్తోంది. షోరూమ్ లు ఓపెనింగ్స్ కోసం మృణాల్ ఠాకూర్ 15 లక్షల వరకు ఛార్జ్ చేస్తుందంట. పాయల్ రాజ్ పుత్ నుంచి తమన్నా, కాజల్, సమంత వరకు అందరూ షోరూమ్ లు ఓపెనింగ్స్ కి వెళ్తారు. పూజ హెగ్డే, రష్మిక మందనలకి షోరూమ్ ప్రారంభోత్సవాలకు ఎక్కువ డిమాండ్ ఉంది. హీరోయిన్స్ ని ఇలా ఆహ్వానించడం ద్వారా పబ్లిక్ ఎక్కువ సంఖ్యలో వస్తారు. తద్వారా షోరూమ్ కి పబ్లిసిటీ వస్తుంది. వీటిని దృష్టిలో ఉంచుకొని కొత్తగా ప్రారంభమయ్యే షోరూల కోసం సెలబ్రెటీలని ఇన్వైట్ చేస్తూ ఉంటారు. మృణాల్ ఠాకూర్ కూడా అదే తరహాలో మంచి ఆదాయం అందుకుంటోంది.